TGTEL/25/A2394

# ప్రజాక్షేత్రం

ప్రతి క్షణం.. ప్రజల పక్షం

సంపుటి: 03 | సంచిక: 121 | హైదరాబాద్ | మంగళవారం | 20-10-2026 | పేజీలు: 08

## దేశంలో నిశ్శబ్ద విప్లవం.. కాంగ్రెస్‌కు పెరుగుతున్న ప్రజామద్దతు

- రాహుల్ నాయకత్వంలో దేశవ్యాప్తంగా నిశ్శబ్ద విప్లవం
- బీజేపీకి ప్రత్యామ్నాయం కోసం ప్రజల ఎదురుచూపు
- కాంగ్రెస్‌కు పెరుగుతున్న మద్దతు.. రాజకీయ మార్పునకు సంకేతం
- లౌకికవాదం, ప్రజాస్వామ్య పరిరక్షణకు పిలుపు
- కాంగ్రెస్ విజయానికి కార్యకర్తలే కీలకం
- క్షేత్రస్థాయి కార్యకర్తలకు మరింత గుర్తింపు ఇవ్వాలి

2



## 50 డిగ్రీలకు చేరనున్న ఎండలు?

- సూపర్ ఎల్‌నినోతో ఎండలు 50 డిగ్రీలు దాటే అవకాశం ఉందని తుమ్మల వ్యాఖ్య
- వర్షా లు తగ్గితే భూగర్భజలాలు అడుగంటిపోయే ప్రమాదం
- గోదావరి నీటిని నిల్వ చేసేందుకు ప్రభుత్వం చర్యలు
- దుమ్ముగూడెం ఆనకట్టపై ఇసుక బస్తాలు ఏర్పాటు చేయాలని సీఎం ఆదేశం
- భద్రాద్రి జిల్లా అమ్మగారిపల్లి వద్ద ఆనకట్టను మంత్రి పరిశీలన

2



## హైదరాబాద్‌లో హనీ ట్రాప్ కలకలం..

- నకిలీ ఖాతాలతో వేల మందికి టోకరా
- యువతుల పేర్లతో నకిలీ ఖాతాలు
- ప్రైవేట్ ఫొటోలతో బెదిరింపులు.. రూ.25 లక్షలు వసూలు
- వెయ్యి మందికి పైగా బాధితులు ఉన్నట్లు గుర్తింపు
- విదేశీయులకూ విస్తరించిన హనీ ట్రాప్

హైదరాబాద్, (ప్రజాక్షేత్రం):

సోషల్ మీడియాలో తెలియని వ్యక్తులతో పరిచయాలు ఎంతటి ప్రమాదకరంగా మారుతాయో తెలిపే ఒక సంచలన ఘటన హైదరాబాద్‌లో వెలుగులోకి వచ్చింది. సోషల్ మీడియా వేదికగా అందమైన యువతులంటూ నకిలీ ప్రొఫైల్స్ సృష్టించి, అమాయకులను బుట్టలో వేసుకుంటూ భారీగా వసూళ్లకు పాల్పడుతున్న ఘరానా మోసగాడిని పోలీసులు అరెస్టు చేశారు. చార్మినార్ డిసిపి కిరణ్ వెల్లడించిన వివరాల ప్రకారం.. ఈ కేసుకు సంబంధించిన విస్తుపోయే నిజాలు బయటపడ్డాయి.

**ఎలా సాగింది ఈ హనీ ట్రాప్ దందా?**

ఈ కేసులో కొండాబత్తుల పవన్ కుమార్ అనే వ్యక్తిని మిగతా 2లో..



## 34 నెలల్లో 12.40 లక్షల మంది రైతులకు పట్టాదారు పాస్‌పుస్తకాలు

- భూ వివాదాల శాశ్వత పరిష్కారమే ప్రభుత్వ లక్ష్యమన్న మంత్రి పొంగులేటి
- రెవెన్యూ వ్యవస్థలో పారదర్శకతకు ప్రాధాన్యం
- భూ భారతి చట్టం అమల్లోకి వచ్చాక 5.68 లక్షల పాస్‌పుస్తకాల పంపిణీ
- దశాబ్దాలుగా పెండింగ్‌లో ఉన్న సమస్యలకు రీ-సర్వేతో పరిష్కారం
- సాగుదారులను గుర్తించి చట్టబద్ధంగా భూ హక్కుల కల్పన
- నారాయణపురంలో 906 మంది రైతులకు 1,600 ఎకరాలకు పైగా హక్కులు
- సూర్యాపేట జిల్లాలో 15 గ్రామాల్లో 2,400 మందికి పట్టాలు
- మొత్తం 3,450 ఎకరాలకు భూ హక్కుల కల్పన
- పాస్‌పుస్తకాలతో బ్యాంకు రుణాలు, రైతు భరోసా వంటి ప్రయోజనాలు
- ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం జిల్లాల్లో రీ-సర్వే వేగవంతం

హైదరాబాద్, (ప్రజాక్షేత్రం):

రాష్ట్రంలో భూ వివాదాలకు శాశ్వత పరిష్కారం చూపడమే ప్రభుత్వ లక్ష్యమని రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. భూ భారతి చట్టం అమలు, పట్టాదారు పాస్‌పుస్తకాల పంపిణీ, భూముల రీసర్వే పురోగతిపై సోమవారం సచివాలయంలో భూ భారతి, రెవెన్యూ శాఖ అధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. రెవెన్యూ వ్యవస్థను పునర్నిర్మించడంతోపాటు ప్రజలకు అందించే సేవల్లో పారదర్శకత పెంచేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు.

**12.40 లక్షల మంది రైతులకు పాస్‌పుస్తకాలు**

గత 34 నెలల్లో 12,40,366 మంది రైతులకు పట్టాదారు పాస్‌పుస్తకాలు జారీ చేసినట్లు మంత్రి వివరించారు. భూ భారతి చట్టం అమల్లోకి వచ్చిన మిగతా 2లో..

## తెలంగాణపై ఎల్‌నినో ఎఫెక్ట్.. పొదుపు బాటలో ప్రభుత్వం!

- ఎల్‌నినో ప్రభావంతో తెలంగాణలో పెరిగిన విద్యుత్ డిమాండ్
- ప్రభుత్వ కార్యాలయాల్లో ఏసీల వాడకంపై ఆంక్షలు విధింపు
- పరిశ్రమలకు విద్యుత్ కోతలు ఉండవని స్పష్టం చేసిన సర్కార్
- తాగునీటి కొరత రాకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు, కార్యాచరణ
- హైదరాబాద్‌లో అక్రమ నీటి మోటార్లపై ప్రత్యేక డ్రైవ్
- అత్యవసరమైతేనే ఏసీల వినియోగం
- ఏసీల ఉష్ణోగ్రత 25 డిగ్రీల వద్దే ఉండాలి
- సాయంత్రం 6 తర్వాత ఏసీల వాడకం తగ్గించాలి
- విద్యుత్ పొదుపునకు ప్రత్యామ్నాయ ప్రణాళికలు
- వ్యవసాయ, గృహ అవసరాలకు నిరంతర విద్యుత్ సరఫరా



హైదరాబాద్, (ప్రజాక్షేత్రం):

ఎల్‌నినో ప్రభావంతో తెలంగాణలో విద్యుత్, నీటి వినియోగం గణనీయంగా పెరిగింది. మరోవైపు ఉత్పత్తి, లభ్యత ఆశించిన స్థాయిలో లేకపోవడంతో రాష్ట్ర ప్రభుత్వం అప్రమత్తమైంది. పొదుపు చర్యలతో పాటు ప్రత్యామ్నాయ ప్రణాళికలను సమర్థవంతంగా అమలు చేసేందుకు సిద్ధమైంది. ఇందులో భాగంగా ప్రభుత్వ కార్యాలయాల్లో విద్యుత్ వాడకాన్ని తగ్గించాలని ఆదేశాలు జారీ చేసింది. సోమవారం ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు ఈ మేరకు ఉన్నతాధికారులకు స్పష్టమైన సూచనలు చేశారు.

పగటి వేళల్లో అత్యవసరమైతే తప్ప ఎయిర్ కండిషనర్లను (ఏసీ) వినియోగించవద్దని, వాటిని కూడా 25 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత వద్దే నిర్వహించాలని స్పష్టం చేశారు. సాయంత్రం 6 గంటల తర్వాత మిగతా 2లో..

## ఎల్‌నినో ఎఫెక్ట్.. కరువు పరిస్థితులపై తెలంగాణ సర్కార్ అలర్ట్

- ఎల్‌నినో ప్రభావంపై అధ్యయనానికి తెలంగాణ ప్రభుత్వం నిర్ణయం
- కేబినెట్ సబ్ కమిటీ చైర్మన్‌గా డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క
- మంత్రులు సీతక్క, ఉత్తమ్, పొంగులేటి, తుమ్మల, వాకిటి శ్రీహరి సభ్యులు
- కరువు పరిస్థితులను ఎదుర్కొనేందుకు ముందస్తు కార్యాచరణ
- గ్రామీణ ప్రాంతాల్లో తాగునీటి సమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి
- నీటి లభ్యత, సరఫరాపై నిరంతర సమీక్షలు
- ఇంకుడు గుంతలు, ఊట కుంటల నిర్మాణానికి ప్రాధాన్యం
- వర్షపు నీటిని ఒడిసిపట్టి భూగర్భ జలాలను పెంచేలా చర్యలు
- వేసవికి ముందే నీటి ఎద్దడి ప్రాంతాల గుర్తింపు
- ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ నిధుల ఖర్చులో జాప్యం వద్దన్న భట్టి



## చెరకు రైతుల ఆందోళనలు..

- మోదీ జోక్యం కోరిన కర్ణాటక సీఎం
- ఉత్తర కర్ణాటకలో రైతుల నిరసనలతో నిలిచిన చెరకు క్రషింగ్
- పొలాల్లోనే పాడవుతున్న పంట.. రైతులకు పెరుగుతున్న నష్టాలు
- చక్కెర కనీస మద్దతు ధర పెంచాలని డీకే శివకుమార్ విజ్ఞప్తి
- 2019 నుంచి కిలో చక్కెర ధర రూ.31 వద్దే కొనసాగుతోందని వెల్లడి
- చెరకు ఆధారిత ఇథనాల్ ధరలను సవరించాలని కేంద్రానికి సూచన
- ఇథనాల్ కొనుగోలు టెండర్ల విధానాన్ని సమీక్షించాలని కోరిన సీఎం
- చక్కెర రికవరీ ప్రాతిపదికను 10.25 నుంచి 9.50 శాతానికి తగ్గించాలని విజ్ఞప్తి
- రైతులకు చెల్లింపులు ఆలస్యం కాకుండా చర్యలు తీసుకోవాలని అభ్యర్థన



బెంగళూరు, (ప్రజాక్షేత్రం):

ఉత్తర కర్ణాటకలో చెరకు రైతుల ఆందోళనలు తీవ్రరూపం దాల్చడంతో రాష్ట్ర ప్రభుత్వం కేంద్రం మిగతా 2లో..



## అడుగంటిన గోదారమ్మ.. పుష్కరాలకు నీళ్లేవీ!?

- గోదావరిలో తగ్గిన ప్రవాహం.. బయటపడుతున్న ఇసుక మేటలు
- భద్రాచలం వద్ద 10.1 అడుగులకు పడిపోయిన నీటిమట్టం
- 2027 పుష్కరాలకు నీటి లభ్యతపై ఆందోళన
- రిజర్వాయర్లలో తగ్గుతున్న నీటి నిల్వలు
- ఎగువ నుంచి నీటి విడుదలపైనే ఆశలు
- పుష్కరాల నిర్వహణకు ముందస్తు కార్యాచరణ అవసరం
- తాగునీరు, పుణ్యస్నానాలకు నీటి కేటాయింపే కీలకం

హైదరాబాద్, (ప్రజాక్షేత్రం):

దక్షిణ భారత జీవనాడి గోదావరిలో నీటి ప్రవాహం తగ్గిపోవడం ఆందోళన కలిగిస్తోంది. సాధారణంగా వర్షాకాలం ముగిసే సమయంలోనూ ఉరకలెత్తే నది.. ఈసారి వర్షాభావ పరిస్థితులతో బక్కచిక్కిపోయింది. భద్రాచలం వద్ద నీటిమట్టం 10.1 అడుగులకు పడిపోవడంతో ఇసుక మేటలు బయటపడుతున్నాయి. మరోవైపు తెలంగాణలోని రిజర్వాయర్లలో నీటి నిల్వలు కూడా గణనీయంగా తగ్గినట్లు గణాంకాలు సూచిస్తున్నాయి. ఈ పరిస్థితుల్లో వచ్చే ఏడాది జరగనున్న గోదావరి పుష్కరాలకు నీటి లభ్యత ఎలా ఉంటుందనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

**పుష్కరాలకు నీళ్లు ఎక్కడి నుంచి?**

2027 జూన్ 26 నుంచి జులై 7 వరకు గోదావరి పుష్కరాలు జరగనున్నాయి. భద్రాచలం దివ్యక్షేత్రానికి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చే అవకాశం ఉంది. పుష్కర స్నానాలకు సరిపడా నీరు అందుబాటులో ఉండాలంటే ప్రభుత్వం ముందస్తు ప్రణాళికలు రూపొందించాల్సిన అవసరం ఉంది.

**నిల్వ చేసుకునే అవకాశం లేక ఇబ్బందులు**

భద్రాచలం వద్ద గోదావరి ప్రవాహంపై మిగతా 2లో..

## నవంబర్ నెలాఖరులోగా కాఫర్ డ్యాం నిర్మించాలి..

- కన్నెపల్లి పంపుహౌస్‌ను సందర్శించిన టీఆర్ఎస్ అధ్యక్షురాలు
- గోదావరి ప్రవాహాన్ని పరిశీలించిన కవిత
- ప్రాణహిత నీటిని మళ్లించేందుకు కాఫర్ డ్యాం నిర్మించాలని డిమాండ్
- నవంబర్ చివరి నాటికి నిర్మాణం పూర్తి చేయాలని సూచన
- గడువులోగా పనులు చేపట్టకపోతే ఆందోళనకు దిగుతామని హెచ్చరిక
- రాష్ట్రంలో నీటి సమస్యలను పరిశీలించేందుకు కవిత పర్యటన
- మేడిగడ్డను బూచీగా చూపి రైతులకు నష్టం చేయవద్దని హితవు
- ప్రభుత్వాన్ని ప్రశ్నించడమే కాకుండా పరిష్కారాలు సూచిస్తున్నామని వెల్లడి
- తమ సూచనలను ప్రభుత్వం సీరియస్‌గా తీసుకోవాలని డిమాండ్
- రైతులకు మేలు చేయడమే తమ లక్ష్యమని కవిత స్పష్టీకరణ




జయశంకర్ భూపాలపల్లి, (ప్రజాక్షేత్రం):

కాళేశ్వరం ప్రాజెక్టులో భాగమైన కన్నెపల్లి లక్ష్మీ పంపుహౌస్‌ను టీఆర్ఎస్ అధ్యక్షురాలు కవిత సందర్శించారు. రాష్ట్రంలో నీటి సమస్యల నేపథ్యంలో చేపట్టిన పర్యటనలో భాగంగా పంపుహౌస్ వ్యూ పాయింట్ నుంచి గోదావరి ప్రవాహాన్ని పరిశీలించారు. ప్రాణహిత నీటిని మళ్లించేందుకు కాఫర్ డ్యాం నిర్మించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. నవంబర్ నెలాఖరులోగా నిర్మాణం పూర్తి చేయాలని స్పష్టం చేశారు. అప్పటిలోగా పనులు చేపట్టకపోతే మిగతా 2లో..

# 50 డిగ్రీలకు చేరనున్న ఎండలు?

- **సూపర్ ఎల్‌నినోతో ఎండలు 50 డిగ్రీలు దాటే అవకాశం ఉందని తుమ్మల వ్యాఖ్య**
- **వర్షా లు తగ్గితే భూగర్భజలాలు అడుగంటిపోయే ప్రమాదం**
- **గోదావరి నీటిని నిల్వ చేసేందుకు ప్రభుత్వం చర్యలు**
- **దుమ్ముగూడెం ఆనకట్టపై ఇసుక బస్తాలు ఏర్పాటు చేయాలని సీఎం ఆదేశం**
- **భద్రాద్రి జిల్లా అమ్మగారిపల్లి వద్ద ఆనకట్టను మంత్రి పరిశీలన**

**హైదరాబాద్, (ప్రజాక్షేత్రం):**

తెలంగాణలో ఎల్‌నినో ప్రభావంతో వర్షాలు తగ్గి భూగర్భజలాలు అడుగంటిపోయే ప్రమాదం ఉందని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆందోళన వ్యక్తం చేశారు. సూపర్ ఎల్‌నినో ప్రభావంతో ఉష్ణోగ్రతలు 50 డిగ్రీలు దాటే అవకాశం ఉందని తెలిపారు. తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా గోదావరి నీటిని నిల్వ చేసే చర్యలు చేపట్టాలని ప్రభుత్వం నిర్ణయించినట్లు వెల్లడించారు.

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అమ్మగారిపల్లి వద్ద గోదావరి ఆనకట్టను మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఇవాళ పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గోదావరి నీటిని నిల్వ చేసేందుకు ప్రభుత్వం కసరత్తు ప్రారంభించిందని చెప్పారు. దుమ్ముగూడెం ఆనకట్టపై ఇసుక బస్తాలు ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి ఆదేశించినట్లు వెల్లడించారు. వర్షాలు తగ్గి భూగర్భజలాలు పడిపోయే పరిస్థితి ఏర్పడితే వ్యవసాయంతో పాటు తాగునీటి సరఫరాపైనా ప్రభావం పడే అవకాశం ఉందని మంత్రి పేర్కొన్నారు. నీటి కొరతను దృష్టిలో పెట్టుకుని తక్కువ నీటితో సాగయ్యే పంటలను ఎంచుకోవాలని రైతులకు సూచించారు. నీటి లభ్యత తగ్గితే విద్యుత్ ఉత్పత్తిపైనా ప్రభావం పడుతుందని తెలిపారు.

ప్రస్తుత పరిస్థితుల్లో రైతులు వరి సాగుకు దూరంగా ఉండాలని తుమ్మల సూచించారు. నీటి వనరులను జాగ్రత్తగా వినియోగించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. రాబోయే వేసవిలో తాగునీటి కష్టాలు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రికి వివరించినట్లు చెప్పారు. గోదావరి నీటిని నిల్వ చేసే ప్రయత్నాల్లో భాగంగా దుమ్ముగూడెం ఆనకట్టపై ఇసుక బస్తాలు ఏర్పాటు చేసే పనులకు ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు.

# హైదరాబాద్‌లో హనీ ట్రాప్ కలకలం..

**మొదటిపేజీ తరువాయి**

పోలీసులు అరెస్టు చేశారు. ప్రాథమిక విచారణలో ఇతను బి.టెక్ (B.Tech) డ్రాపవుట్ అని తేలింది. పవన్ సోషల్ మీడియాలో అమ్మాయిల పేర్లతో నకిలీ ఖాతాలను సృష్టించి, అమాయక యువకులను ఆకర్షించేవాడు. వారితో చనువుగా చాటింగ్ చేస్తూ ప్రైవేట్ ఫోటోలు, వీడియోలను సేకరించేవాడు. ఆ తర్వాత వాటిని అడ్డం పెట్టుకుని బాధితులను బ్లాక్‌మెయిల్ చేయడం ప్రారంభించేవాడు. ఎవరికైనా చెబితే ఆ ఫోటోలను సోషల్ మీడియాలో వైరల్ చేస్తానని బెదిరిస్తూ ఇప్పటి వరకు సుమారు రూ. 25 లక్షల రూపాయల వరకు వసూలు చేసినట్లు పోలీసులు గుర్తించారు.

**విదేశాలకూ పాకిన వేర్లు..**
**1000 మందికి పైగా బాధితులు**

ఈ మోసాల పరిధి చూసి పోలీసులు సైతం అవాక్కయ్యారు. దాదాపు 1000 మందికి పైగా వ్యక్తులు ఇతని నకిలీ ఖాతాలతో చాటింగ్ చేసినట్లు తేలింది. వీరిలో ప్రస్తుతం 82 మందికి సంబంధించిన సున్నితమైన ప్రైవేట్ డేటా, ఫోటోలు, వీడియోలు నిందితుడి వద్ద ఉన్నట్లు పోలీసులు వెల్లడించారు. విశేషం ఏంటంటే.. బాధితులలో కేవలం స్థానికులు మాత్రమే కాకుండా, ఇతర రాష్ట్రాలకు చెందిన వారు మరియు పాకిస్తాన్, కెనడా, టర్కీ వంటి విదేశీ దేశాల వారు కూడా ఉండటం గమనార్హం.

**పోలీసుల హెచ్చరికలు..**
**అప్రమత్తంగా ఉండాలని సూచన**

సోషల్ మీడియాను నమ్మి ఈ విధంగా మోసపోతున్న వారి ఉదంతాలు పెరుగుతున్న నేపథ్యంలో చార్మినార్ డిసిపి కిరణ్ ప్రజలకు కీలక హెచ్చరికలు జారీ చేశారు. సోషల్ మీడియాలో పరిచయం లేనివారితో చాటింగ్ చేసేటప్పుడు, ముఖ్యంగా వ్యక్తిగత వివరాలు, ఫోటోలు పంచుకునేటప్పుడు అత్యంత అప్రమత్తంగా ఉండాలని కోరారు. ఒకవేళ ఎవరైనా ఇలాంటి సైబర్ నేరాలు లేదా బ్లాక్‌మెయిల్‌కు గురైతే భయపడకుండా వెంటనే పోలీసులను ఆశ్రయించి ఫిర్యాదు చేయాలని సూచించారు.

## ఎల్‌నినో ఎఫెక్ట్.. కరువు పరిస్థితులపై
# తెలంగాణ సర్కార్ అలర్ట్

- **ఎల్‌నినో ప్రభావంపై అధ్యయనానికి తెలంగాణ ప్రభుత్వం నిర్ణయం**
- **కేబినెట్ సబ్ కమిటీ చైర్మన్‌గా డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క**
- **మంత్రులు సీతక్క, ఉత్తమ్, పొంగులేటి, తుమ్మల, వాకిటి శ్రీహరి సభ్యులు**
- **కరువు పరిస్థితులను ఎదుర్కొనేందుకు ముందస్తు కార్యాచరణ**
- **గ్రామీణ ప్రాంతాల్లో తాగునీటి సమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి**
- **నీటి లభ్యత, సరఫరాపై నిరంతర సమీక్షలు**
- **ఇంకుడు గుంతలు, ఊట కుంటల నిర్మాణానికి ప్రాధాన్యం**
- **వేసవికి ముందే నీటి ఎద్దడి ప్రాంతాల గుర్తింపు**
- **ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ నిధుల ఖర్చులో జాప్యం వద్దన్న భట్టి**

**హైదరాబాద్, (ప్రజాక్షేత్రం):**

ఎల్‌నినో ప్రభావంతో రాష్ట్రంలో ఎదురయ్యే వర్షాభావ పరిస్థితులను ఎదుర్కొనేందుకు తెలంగాణ ప్రభుత్వం ముందస్తు చర్యలకు సిద్ధమవుతోంది. ఈ పరిస్థితులపై అధ్యయనం చేసి, అవసరమైన కార్యాచరణను రూపొందించేందుకు కేబినెట్ సబ్ కమిటీని ఏర్పాటు చేసింది. ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అధ్యక్షతన ఏర్పాటైన ఈ కమిటీలో మంత్రులు సీతక్క, ఉత్తమ్ కుమార్ రెడ్డి, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు, వాకిటి శ్రీహరి సభ్యులుగా ఉంటారు. ఈ మేరకు ప్రభుత్వం సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది.

**కరువు నివారణకు ముందస్తు ప్రణాళిక**

ఎల్‌నినో ప్రభావంతో వర్షాలు తగ్గి నీటి కొరత ఏర్పడే పరిస్థితులను కమిటీ సమీక్షించనుంది. కరువు పరిస్థితులు తీవ్రం కాకముందే తీసుకోవాల్సిన చర్యలను పరిశీలించి ప్రభుత్వానికి సిఫార్సులు చేయనుంది. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో తాగునీటి సమస్యలు తలెత్తకుండా ముందస్తు ప్రణాళికలు రూపొందించనుంది. నీటి లభ్యత, సరఫరా పరిస్థితులను ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ అవసరమైన చర్యలపై దృష్టి సారించనుంది.

**భూగర్భ జలాల పెంపునకు చర్యలు**

నీటి సంరక్షణకు ప్రాధాన్యం ఇవ్వాలని ప్రభుత్వం భావిస్తోంది. ఇందులో భాగంగా ఇంకుడు గుంతలు, ఊట కుంటల నిర్మాణంపై ప్రత్యేకంగా దృష్టి పెట్టనున్నారు. వర్షపు నీటిని వృథా కాకుండా ఒడిసిపట్టి భూగర్భ జలాల మట్టాలను పెంచేందుకు చర్యలు చేపట్టనున్నారు. వేసవి ప్రారంభమయ్యేలోగా నీటి ఎద్దడి ఎదురయ్యే గ్రామాలను గుర్తించి, సమస్య పరిష్కారానికి కార్యాచరణ సిద్ధం చేయనున్నారు. ఎల్‌నినో ప్రభావంపై పరిస్థితులను ఎప్పటికప్పుడు అంచనా వేస్తూ ప్రభుత్వానికి కమిటీ నివేదికలు, సిఫార్సులు అందించనుంది.

**సబ్‌ప్లాన్ నిధుల వినియోగంపై సమీక్ష**

మరోవైపు, ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ నిధుల వినియోగాన్ని వేగవంతం చేయాలని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అధికారులను ఆదేశించారు. సోమవారం సబ్‌ప్లాన్ అమలుపై సంబంధిత అధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా నిధుల ఖర్చులో జాప్యం జరగకూడదని స్పష్టం చేశారు. ఎస్సీ, ఎస్టీ వర్గాల సంక్షేమం, సాధికారతకు ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందని తెలిపారు.

**బడ్జెట్ ఖర్చుపై నిరంతర పర్యవేక్షణ**

ఎస్సీ, ఎస్టీ వర్గాలకు సంబంధించిన పథకాల అమలులో నిధులు సకాలంలో వినియోగించేలా చర్యలు తీసుకోవాలని భట్టి సూచించారు. రుణాల పునర్వ్యవస్థీకరణపై సమగ్ర కార్యాచరణ రూపొందించాలని అధికారులకు తెలిపారు. బడ్జెట్ కేటాయింపులు, ఇప్పటివరకు చేసిన ఖర్చు, మిగిలిన నిధుల వినియోగంపై నిరంతరం పర్యవేక్షణ ఉండాలని ఆదేశించారు. సంక్షేమ పథకాల అమలులో జాప్యం లేకుండా అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.

# తెలంగాణపై ఎల్‌నినో ఎఫెక్ట్..
# పొదుపు బాటలో ప్రభుత్వం!

**మొదటిపేజీ తరువాయి**

ఏసీల వినియోగాన్ని గణనీయంగా తగ్గించాలని ఆదేశించారు. రాష్ట్రంలో విద్యుత్ ఉత్పత్తి ఆశాజనకంగా లేనప్పటికీ, వ్యవసాయ, గృహ అవసరాలకు నిరంతరాయంగా సరఫరా అందిస్తున్నామని తెలిపారు.

పరిశ్రమలకు ఎలాంటి విద్యుత్ కోతలు విధించడం లేదని, పారిశ్రామిక యాజమాన్యాలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని భరోసా ఇచ్చారు. అన్ని థర్మల్ పవర్ స్టేషన్లలో విద్యుత్ ఉత్పత్తిని గరిష్ఠ స్థాయికి పెంచేందుకు చర్యలు తీసుకోవాలని, ముఖ్యంగా యాదాద్రి థర్మల్ పవర్ స్టేషన్‌పై ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులను ఆదేశించారు.

ఎల్‌నినో ప్రభావంతో భవిష్యత్తులో తలెత్తే తాగునీరు, విద్యుత్ కొరతను నివారించేందుకు క్షేత్రస్థాయిలో పటిష్టమైన కార్యాచరణ ప్రణాళికలు సిద్ధం చేయాలని సంజయ్ జాజు సూచించారు. ఈ అంశంపై త్వరలోనే అఖిలపక్ష సమావేశం, కేబినెట్ సబ్‌కమిటీ భేటీ నిర్వహిస్తామని ఆయన వెల్లడించారు.

**నీటి కష్టాలు.. అక్రమ మోటార్లపై ఉక్కుపాదం**

స్థానిక నీటి వనరుల నుంచి వ్యవసాయానికి అక్రమంగా మోటార్లు బిగించి నీటిని తోడేస్తుండటంతో, విద్యుత్ లోడ్ పెరిగి ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోతున్నాయని ఇంధన శాఖ అధికారులు సమావేశంలో వివరించారు. మంజీరా, సింగూరు రిజర్వాయర్ల నుంచి నీటి లభ్యత లేకపోవడంతో, అక్కడి నుంచి అందాల్సిన 110 మిలియన్ గ్యాలన్ల నీటిని మిషన్ భగీరథ (60 MGD), కృష్ణా నది వంటి ప్రత్యామ్నాయ వనరుల ద్వారా సర్దుబాటు చేస్తున్నట్లు తెలిపారు. హైదరాబాద్‌లో తాగునీటి అవసరాలకు తప్ప నిర్మాణాలకు, ఇతర పనులకు కొత్త బోర్ల తవ్వకానికి అనుమతులు మంజూరు చేయవద్దని ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేష్ రంజన్ స్పష్టం చేశారు. నగరంలో మున్సిపల్ నల్లా కనెక్షన్లకు అక్రమంగా మోటార్లు బిగించి నీటిని తోడ్చుతున్న వారిపై 'హైడ్రా' సహకారంతో ప్రత్యేక ఎన్‌ఫోర్స్‌మెంట్ డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. నవంబర్ 1 నుంచి నిర్మాణాలకు గ్రీన్ ట్యాంకర్ల ద్వారా శుద్ధి చేసిన నీటిని (ఎస్‌టీపీ వాటర్) సరఫరా చేయనున్నట్లు ప్రకటించారు. రంగారెడ్డి జిల్లాలో భూగర్భ జలాలు గణనీయంగా తగ్గుతున్నాయని, తాగునీటి కొరత రాకుండా ప్రత్యామ్నాయ ప్రణాళికలు అమలు చేస్తున్నామని మరో ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వికాస్ రాజ్ తెలిపారు.



## దేశంలో నిశ్శబ్ద విప్లవం.. కాంగ్రెస్‌కు
# పెరుగుతున్న ప్రజామద్దతు

- **రాహుల్ నాయకత్వంలో దేశవ్యాప్తంగా నిశ్శబ్ద విప్లవం**
- **బీజేపీకి ప్రత్యామ్నాయం కోసం ప్రజల ఎదురుచూపు**
- **కాంగ్రెస్‌కు పెరుగుతున్న మద్దతు.. రాజకీయ మార్పునకు సంకేతం**
- **లౌకికవాదం, ప్రజాస్వామ్య పరిరక్షణకు పిలుపు**
- **కాంగ్రెస్ విజయానికి కార్యకర్తలే కీలకం**
- **క్షేత్రస్థాయి కార్యకర్తలకు మరింత గుర్తింపు ఇవ్వాలి**



**హైదరాబాద్, (ప్రజాక్షేత్రం):**

రాహుల్‌గాంధీ నాయకత్వంలో దేశవ్యాప్తంగా నిశ్శబ్ద విప్లవం కొనసాగుతోందని రాష్ట్ర నీటిపారుదల, పౌరసరఫరాల శాఖల మంత్రి కెప్టెన్ ఎన్. ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. బీజేపీ, ప్రధాని నరేంద్రమోదీకి ప్రత్యామ్నాయం కోసం ప్రజలు చూస్తున్నారని, కాంగ్రెస్‌కు పెరుగుతున్న మద్దతు దేశంలో రాజకీయ మార్పునకు సంకేతమని పేర్కొన్నారు. చార్మినార్ వద్ద సోమవారం నిర్వహించిన రాజీవ్‌గాంధీ సద్భావన యాత్ర స్మారక దినోత్సవం, రాజీవ్ సద్భావన పురస్కార ప్రదానోత్సవానికి ఉత్తమ్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, బీజేపీని ఓడించి లౌకికవాదం, ప్రజాస్వామ్యం, జాతీయ సమైక్యతను బలోపేతం చేసే పోరాటంలో కార్యకర్తలు రాహుల్‌గాంధీకి అండగా నిలవాలని పిలుపునిచ్చారు. గత బీఆర్ఎస్ పాలనలో ఇబ్బందులు ఎదుర్కొంటూ కాంగ్రెస్ కోసం పనిచేసిన క్షేత్రస్థాయి కార్యకర్తలకు ప్రభుత్వం, పార్టీ మరింత గుర్తింపు ఇవ్వాలని సూచించారు. కార్యకర్తల త్యాగాలు, పట్టుదల తెలంగాణలో కాంగ్రెస్ తిరిగి అధికారంలోకి రావడంలో కీలక పాత్ర పోషించాయని అన్నారు.

పార్టీ కార్యక్రమాల్లో మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు చురుగ్గా పాల్గొని కార్యకర్తలకు ప్రోత్సాహం అందించాలని కోరారు. ఏఐసీసీ కార్యదర్శి సచిన్ ఎం. సావంత్ మాట్లాడుతూ, జాతీయ సమైక్యత, మతసామరస్యం, సమాచార సాంకేతిక రంగం, పంచాయతీ రాజ్, యువత సాధికారతకు మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ చేసిన సేవలను గుర్తుచేశారు. కులం, మతం పేరుతో పెరుగుతున్న విభజనలు దేశానికి నష్టం కలిగిస్తాయని, ప్రేమ, సామరస్యం, ఐక్యతను కాపాడాలని పిలుపునిచ్చారు. రాజీవ్‌గాంధీ సద్భావన యాత్ర సందేశాన్ని కొనసాగిస్తూ 1990 నుంచి ఏటా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న మాజీ పీసీసీ అధ్యక్షుడు వి. హనుమంతరావును వక్తలు అభినందించారు. ఈ సందర్భంగా సమాజానికి విశిష్ట సేవలందిస్తున్న హైదరాబాద్‌లోని ఏషియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ నెఫ్రాలజీ అండ్ యూరాలజీ వ్యవస్థాపకుడు డాక్టర్ సి. మల్లికార్జునను సత్కరించారు. కార్యక్రమంలో టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్, మాజీ మంత్రి గీతారెడ్డి, ఎంపీ అనిల్‌కుమార్‌యాదవ్, సీనియర్ నాయకులు అంజన్‌కుమార్‌యాదవ్, ఫిరోజ్‌ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

# నవంబర్ నెలాఖరులోగా కాఫర్ డ్యాం నిర్మించాలి..

**మొదటిపేజీ తరువాయి**

కన్నెపల్లి పంపుహౌస్ వద్ద ఆందోళనకు దిగుతామని హెచ్చరించారు.

**ప్రాణహిత నీటిని మళ్లించాలి**

రాష్ట్రంలో నీటి సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలని కవిత కోరారు. ప్రాణహిత నీటిని మళ్లించేలా కాఫర్ డ్యాం నిర్మాణం చేపట్టాలని సూచించారు. ఈ పనులను నవంబర్ నెలాఖరులోగా పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. గడువులోగా నిర్మాణం చేపట్టకపోతే కన్నెపల్లి పంపుహౌస్ వద్ద నిరసన కార్యక్రమం నిర్వహిస్తామని ప్రకటించారు.

**మేడిగడ్డను సాకుగా చూపొద్దు**

మేడిగడ్డను బూచీగా చూపి రైతులకు నష్టం చేయవద్దని కవిత ప్రభుత్వానికి హితవు పలికారు. నీటి సమస్యలపై ప్రశ్నించడమే కాకుండా, వాటికి పరిష్కార మార్గాలను కూడా సూచిస్తున్నామని చెప్పారు. ప్రజల సమస్యలు పరిష్కారం కావాలన్న చిత్తశుద్ధితోనే తాము క్షేత్రస్థాయికి వచ్చామని తెలిపారు.

**రైతులకు మేలు చేయాలని డిమాండ్**

టీఆర్ఎస్ పార్టీ కేవలం రాజకీయాలు చేస్తూ టీవీల్లో కనిపించాలనే ఉద్దేశంతో పనిచేయడం లేదని కవిత అన్నారు. ప్రజలకు, ముఖ్యంగా రైతులకు ప్రయోజనం చేకూరాలన్నదే తమ లక్ష్యమని స్పష్టం చేశారు. ప్రభుత్వం తమ సూచనలను సీరియస్‌గా తీసుకుని, నీటి సమస్య పరిష్కారానికి చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.

కాఫర్ డ్యాం నిర్మాణంపై ప్రభుత్వం స్పందించి, నిర్దేశించిన గడువులోగా పనులు ప్రారంభించాలని కవిత కోరారు. రైతులకు ఇబ్బందులు కలగకుండా నీటి లభ్యతను మెరుగుపరిచేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు.

# అడుగంటిన గోదారమ్మ.. పుష్కరాలకు నీళ్లేవీ!?

**మొదటిపేజీ తరువాయి**



ఆధారపడాల్సి వస్తోంది. అక్కడ నీటిని పెద్ద మొత్తంలో నిల్వ చేసుకునే వ్యవస్థ లేకపోవడంతో ఎగువ ప్రాంతాల నుంచి వచ్చే ప్రవాహమే కీలకం. ఎగువ రిజర్వాయర్లలో తాగునీరు, సాగునీటి అవసరాలకు ప్రాధాన్యం ఇవ్వాల్సి ఉండటంతో దిగువకు నీటి విడుదల కూడా కీలకంగా మారుతోంది.

**ముందస్తు ప్రణాళికే కీలకం**

వచ్చే ఏడాది పుష్కరాల నాటికి నీటి లభ్యతను అంచనా వేయడం, తాగునీటి అవసరాలను దృష్టిలో ఉంచుకోవడం, భక్తుల పుణ్యస్నానాలకు అవసరమైన ఏర్పాట్లపై ముందుగానే కార్యాచరణ రూపొందించడం అత్యవసరం. లేదంటే పుష్కరాల నిర్వహణతో పాటు భద్రాచలం పరిసర ప్రాంతాల్లో తాగునీటి సరఫరా కూడా సవాలుగా మారే అవకాశం ఉంది.

# 34 నెలల్లో 12.40 లక్షల మంది
# రైతులకు పట్టాదారు పాస్‌పుస్తకాలు

**మొదటిపేజీ తరువాయి**

తర్వాత 5,68,858 పాస్‌పుస్తకాలను పంపిణీ చేసినట్లు తెలిపారు. భూములపై హక్కులకు సంబంధించి రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం చర్యలు చేపడుతోందన్నారు.

**రీ-సర్వేతో భూ సమస్యలకు పరిష్కారం**

దశాబ్దాలుగా పెండింగ్‌లో ఉన్న భూ వివాదాలను రీసర్వే ద్వారా పరిష్కరించే అవకాశం ఉందని పొంగులేటి పేర్కొన్నారు. భూములను సాగు చేస్తున్నవారిని గుర్తించి, వారికి చట్టబద్ధమైన హక్కులు కల్పించడంపై దృష్టి సారించినట్లు తెలిపారు. అర్హులైన రైతులకు భూమిపై హక్కులు దక్కేలా రెవెన్యూ అధికారులు క్షేత్రస్థాయిలో చర్యలు తీసుకోవాలని సూచించారు.

**నారాయణపురంలో 906 మందికి హక్కులు**

భూ హక్కుల కల్పనలో భాగంగా నారాయణపురంలో 906 మంది రైతులకు 1,600 ఎకరాలకు పైగా భూమిపై హక్కులు కల్పించినట్లు మంత్రి వెల్లడించారు. భూ సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలకు ఇది ఉదాహరణగా నిలుస్తుందని వివరించారు. భూములను సాగు చేస్తున్న రైతులకు హక్కులు కల్పించడంలో జాప్యం జరగకూడదని అధికారులకు సూచించారు.

**సూర్యాపేటలో 2,400 మందికి పట్టాలు**

సూర్యాపేట జిల్లాలోని 15 గ్రామాల్లో 2,400 మంది రైతులకు 3,450 ఎకరాలకు పట్టాలు అందించినట్లు పొంగులేటి తెలిపారు. భూ హక్కులు పొందిన రైతులకు ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు అందేలా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. పట్టాదారు పాస్‌పుస్తకాలు ఉన్న రైతులకు బ్యాంకు రుణాలు, రైతు భరోసా వంటి ప్రయోజనాలు సకాలంలో అందేలా చూడాలని అధికారులను ఆదేశించారు.

**మూడు జిల్లాల్లో రీ-సర్వే వేగవంతం**

ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం జిల్లాల్లో భూముల రీసర్వే పనులు వేగంగా సాగుతున్నాయని మంత్రి వివరించారు. ఈ ప్రక్రియను సమర్థంగా పూర్తి చేసి, భూ హక్కుల కోసం ఎదురుచూస్తున్న రైతులకు న్యాయం చేయాలని అధికారులకు సూచించారు. భూ రికార్డుల్లో స్పష్టత తీసుకురావడం, వివాదాలకు తావులేకుండా చూడటం, అర్హులైన సాగుదారులకు చట్టబద్ధమైన హక్కులు కల్పించడం ప్రభుత్వ ప్రాధాన్యాలని పేర్కొన్నారు.

# చెరకు రైతుల ఆందోళనలు..

**మొదటిపేజీ తరువాయి**

జోక్యాన్ని కోరింది. చక్కెర మిల్లుల్లో చెరకు క్రషింగ్ నిలిచిపోవడం, పంట పొలాల్లోనే పాడైపోతుండటంతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని కర్ణాటక ముఖ్యమంత్రి డీకే శివకుమార్ తెలిపారు. సమస్య పరిష్కారానికి తక్షణ చర్యలు తీసుకోవాలని కోరుతూ ప్రధాని నరేంద్ర మోదీకి లేఖ రాశారు. చక్కెర మద్దతు ధర పెంపుతోపాటు ఇథనాల్ ధరలు, కొనుగోలు విధానం, చెరకు ధరల నిర్ణయానికి సంబంధించిన అంశాలను లేఖలో ప్రస్తావించారు.

**ఆందోళనలతో నిలిచిన క్రషింగ్**

ఉత్తర కర్ణాటకలో చెరకు రైతులు తమ డిమాండ్ల సాధన కోసం నిరసనలు కొనసాగిస్తున్నారు. కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషి నివాసాన్ని ముట్టడించేందుకు రైతులు పాదయాత్రలు చేపట్టడంతోపాటు రహదారులను దిగ్బంధిస్తున్నారు. దీంతో ప్రజా రవాణా, రోజువారీ కార్యకలాపాలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయని సీఎం పేర్కొన్నారు. మరోవైపు చక్కెర మిల్లుల్లో చెరకు క్రషింగ్ నిలిచిపోవడంతో పంటను సకాలంలో వినియోగించుకోలేని పరిస్థితి ఏర్పడిందని వివరించారు. సమస్య మరింత ముదరకుండా కేంద్రం జోక్యం చేసుకోవాలని కోరారు.

**చక్కెర మద్దతు ధర పెంచాలి**

చక్కెర కనీస విక్రయ ధరను 2019 ఫిబ్రవరిలో కిలోకు రూ.31గా నిర్ణయించారని, అప్పటి నుంచి దానిని పెంచలేదని డీకే శివకుమార్ లేఖలో పేర్కొన్నారు. ఇదే సమయంలో చెరకు ధర టన్నుకు రూ.2,750 నుంచి రూ.3,650కు పెరిగిందని గుర్తుచేశారు. చెరకు కొనుగోలు వ్యయం పెరుగుతున్నప్పటికీ చక్కెర విక్రయ ధరలో మార్పు లేకపోవడంతో మిల్లులపై ఆర్థిక భారం పెరుగుతోందని తెలిపారు. ఈ పరిస్థితుల్లో రైతులకు గిట్టుబాటు ధర చెల్లించడం కష్టమవుతోందని, చక్కెర కనీస విక్రయ ధరను వెంటనే సవరించాలని విజ్ఞప్తి చేశారు.

**వినియోగదారులకు భారం పడకుండా..**

చక్కెర ధరల విషయంలో గృహ వినియోగదారులు, భారీ స్థాయిలో కొనుగోలు చేసే వాణిజ్య సంస్థల అవసరాలను వేర్వేరుగా పరిగణించాలని సీఎం సూచించారు. సాధారణ ప్రజలపై అదనపు భారం పడకుండా చూడటంతోపాటు, వాణిజ్య కొనుగోలుదారుల నుంచి మిల్లులకు తగిన ఆదాయం లభించేలా ధరల విధానాన్ని రూపొందించాలని కోరారు. దీనివల్ల మిల్లుల ఆర్థిక పరిస్థితి మెరుగుపడటంతోపాటు చెరకు రైతులకు చెల్లింపులు సకాలంలో జరిగే అవకాశం ఉంటుందని ఆయన అభిప్రాయపడ్డారు.

**ఇథనాల్ కొనుగోలు విధానంపై అభ్యంతరం**

ఆయిల్ మార్కెటింగ్ కంపెనీలు ఇటీవల ప్రకటించిన ఇథనాల్ కొనుగోలు టెండర్లలో చెరకు రసం, షుగర్ సిరప్ ద్వారా తయారయ్యే ఇథనాల్‌ను మినహాయించడంపై డీకే శివకుమార్ అభ్యంతరం వ్యక్తం చేశారు. ఈ విధానం చక్కెర మిల్లుల ఆదాయాన్ని తగ్గించి, రైతులకు చెరకు బకాయిల చెల్లింపులపై ప్రభావం చూపుతుందని ఆందోళన తెలిపారు. టెండర్ల నిబంధనలను సమీక్షించి, చెరకు ఆధారిత ఇథనాల్‌కూ తగిన అవకాశం కల్పించాలని కేంద్రాన్ని కోరారు.

**ఇథనాల్ ధరలూ సవరించాలి**

చెరకు సరఫరాకు సంబంధించిన న్యాయమైన, లాభదాయక ధర (ఎఫ్ఆర్‌పీ) పెరుగుతున్నప్పటికీ చెరకు రసం ద్వారా తయారు చేసే ఇథనాల్ ధరలు 2022-23 నుంచి పెరగలేదని సీఎం పేర్కొన్నారు. ధాన్య ఆధారిత ఇథనాల్ ధరలను పెంచినట్లుగానే చెరకు ఆధారిత ఇథనాల్ ధరలను కూడా సవరించాలని సూచించారు. ఇథనాల్ విక్రయాల ద్వారా మిల్లులకు తగిన ఆదాయం వస్తే రైతులకు చెల్లింపులు చేయడం సులభమవుతుందని వివరించారు.

**రికవరీ ప్రాతిపదికను తగ్గించాలి**

చెరకు నుంచి ఎంత శాతం చక్కెర ఉత్పత్తి అవుతుందనే అంశాన్ని ఆధారంగా చేసుకుని రైతులకు చెల్లించే ధరను నిర్ణయిస్తారు. చక్కెర రికవరీ ప్రాతిపదికను 10.25 శాతానికి పెంచడం వల్ల తక్కువ రికవరీ నమోదయ్యే ప్రాంతాల్లోని రైతులకు పూర్తి ఎఫ్ఆర్‌పీ అందడం లేదని డీకే శివకుమార్ పేర్కొన్నారు. గతంలో ఉన్న విధానం ప్రకారం రికవరీ ప్రాతిపదికను తిరిగి 9.50 శాతానికి తగ్గించాలని కోరారు. దీనివల్ల ప్రాంతాలవారీగా రికవరీలో తేడాలున్నా రైతులకు న్యాయం జరిగే అవకాశం ఉంటుందని తెలిపారు.

**రాష్ట్ర ప్రభుత్వం నుంచి రూ.290 కోట్లు**

రైతుల సమస్యల పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం తన పరిధిలో ఇప్పటికే కొన్ని చర్యలు తీసుకుందని సీఎం లేఖలో వివరించారు. చక్కెర మిల్లుల్లో డిజిటల్ తూకం వ్యవస్థ, ప్రయోగశాలల గుర్తింపు వంటి అంశాలపై చర్యలు చేపట్టినట్లు తెలిపారు. చెరకు టన్నుకు అదనంగా రూ.100 చొప్పున చెల్లించే విధానంలో భాగంగా రైతులకు రూ.290 కోట్లు విడుదల చేసినట్లు పేర్కొన్నారు. ఇందులో టన్నుకు రూ.50 చొప్పున రాష్ట్ర ప్రభుత్వమే భరిస్తోందని వివరించారు.

**కేంద్రం నిర్ణయంపైనే ఆశలు**

చెరకు ధరలు, చక్కెర కనీస విక్రయ ధర, ఇథనాల్ కొనుగోలు విధానం వంటి ప్రధాన అంశాలు కేంద్ర ప్రభుత్వ పరిధిలో ఉన్నాయని డీకే శివకుమార్ పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం తనవంతుగా చర్యలు తీసుకున్నప్పటికీ, రైతుల ప్రధాన డిమాండ్ల పరిష్కారానికి కేంద్రం నిర్ణయం అవసరమని స్పష్టం చేశారు. రైతుల ఆందోళనలు కొనసాగకుండా, పంట నష్టపోకుండా, చక్కెర మిల్లుల్లో క్రషింగ్ తిరిగి ప్రారంభమయ్యేలా ప్రధాని నరేంద్ర మోదీ తక్షణమే జోక్యం చేసుకోవాలని కోరారు.

# లష్కర్ గూడలో ఘనంగా సద్దుల బతుకమ్మ వేడుకలు

- -సంప్రదాయాలు, సంస్కృతిని కాపాడుకోవడం మనందరి బాధ్యత
- ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి హాజరు.. వేడుకలను ఘనంగా నిర్వహించిన సర్పంచ్ ఐలే ఐలయ్య

**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి, అక్టోబర్ 19(ప్రజా-క్షేత్రం):**

తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే సద్దుల బతుకమ్మ వేడుకలు అబ్దుల్లాపూర్‌మెట్టు మండలం లష్కర్‌గూడ గ్రామంలో ఆదివారం అంగరంగ వైభవంగా జరిగాయి. గ్రామ సర్పంచ్ ఐలే ఐలయ్య ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ వేడుకలకు ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి ముఖ్య అతిథిగా హాజరై మహిళలు, యువతులతో కలిసి బతుకమ్మ సంబరాల్లో పాల్గొన్నారు.

**మహిళల ఆటపాటలతో పండుగ సందడి**

దసరా నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకొని గ్రామంలో నిర్వహించిన సద్దుల బతుకమ్మ వేడుకల్లో మహిళలు, యువతులు రంగురంగుల పూలతో బతుకమ్మలను అందంగా పేర్చి సంప్రదాయ దుస్తుల్లో తరలివచ్చారు. బతుకమ్మ పాటలు పాడుతూ, ఆటపాటలతో సందడి చేస్తూ వేడుకలను భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. గ్రామమంతా పండుగ వాతావరణం నెలకొనగా, పెద్ద సంఖ్యలో గ్రామస్తులు పాల్గొని సంబరాలను ఆస్వాదించారు.

**ప్రకృతిని పూజించే గొప్ప సంస్కృతి తెలంగాణ సొంతం:ఎమ్మెల్యే**

ఈ సందర్భంగా ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి మాట్లాడుతూ.. ప్రకృతిని దైవంగా భావించి పూజించే గొప్ప సంప్రదాయం తెలంగాణలో తరతరాలుగా కొనసాగుతోందన్నారు. బతుకమ్మ పండుగ మన సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక అని పేర్కొన్నారు. నేటి తరం మహిళలు, యువతులు సైతం ఇలాంటి వేడుకల్లో ఉత్సాహంగా పాల్గొనడం అభినందనీయమన్నారు. లష్కర్‌గూడలో సద్దుల బతుకమ్మ వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు కృషి చేసిన గ్రామ సర్పంచ్ ఐలే ఐలయ్యను అభినందించారు.

**ప్రకృతిని కాపాడితేనే భవిష్యత్తు బాగుంటుంది: సర్పంచ్ ఐలే ఐలయ్య**

గ్రామ సర్పంచ్ ఐలే ఐలయ్య మాట్లాడుతూ.. తెలంగాణలో జరుపుకునే పండుగలన్నింటిలో బతుకమ్మకు ప్రత్యేక స్థానం ఉందన్నారు. పూలను దైవంగా భావించి పూజించే సంప్రదాయాన్ని భావితరాలకు అందించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని తెలిపారు. మనిషి జీవితం ప్రకృతితో ముడిపడి ఉందని, ప్రకృతిని పరిరక్షించుకుంటేనే భవిష్యత్తు సంతోషంగా ఉంటుందని పేర్కొన్నారు. గ్రామంలో మహిళలు, యువతులు పెద్ద సంఖ్యలో పాల్గొనేలా సద్దుల బతుకమ్మ వేడుకలను సంప్రదాయబద్ధంగా నిర్వహించడం ఆనందంగా ఉందన్నారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుతూ ఇలాంటి పండుగలను ఐకమత్యంతో జరుపుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ రాజు, మాజీ సర్పంచ్ శేఖర్, వార్డు సభ్యులు, బాల్‌రాజ్ యాదవ్, సుర్వి సుదర్శన్, ఐలే సాయి, మహిళలు, యువతులు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



# అమెరికాలో బతుకమ్మ వేడుకల్లో పెద్దేముల్ తండా వాసి నవీన్ జాదవ్ సందడి!

- ఉటా రాష్ట్రంలో జిటిఎ ఆధ్వర్యంలో ఘనంగా బతుకమ్మ సంబరాలు
- తెలంగాణ సంస్కృతి, సాంప్రదాయాల పరిరక్షణలో కీలక పాత్ర

**పెద్దేముల్, అక్టోబర్ 19(ప్రజాక్షేత్రం):**

అమెరికాలోని ఉటా రాష్ట్రంలో తెలంగాణ సంస్కృతి, సాంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ వేడుకలను జిటిఎ ఉటా చాప్టర్ ఆధ్వర్యంలో వైభవంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో పెద్దేముల్ గ్రామ పంచాయతీ అనుబంధ గ్రామమైన పెద్దేముల్ తండాకు చెందిన డీసీసీ అధ్యక్షులు జాదవ్ ధారాసింగ్ నాయక్ కుమారుడు నవీన్ జాదవ్ కీలక పాత్ర పోషించడం విశేషం. జిటిఎ ఉటా చాప్టర్‌లో వాలంటీర్ అండ్ స్పోర్ట్స్ కోఆర్డినేటర్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్న నవీన్ జాదవ్, బతుకమ్మ వేడుకల విజయవంతమైన నిర్వహణలో తన వంతు సహకారం అందించారు.

**విదేశాల్లోనూ తెలంగాణ సంస్కృతికి పట్టం**

తెలంగాణ ఆడపడుచుల ఆత్మీయతకు, పూల పండుగ వైభవానికి ప్రతీక అయిన బతుకమ్మ సంబరాలను అమెరికాలో ఘనంగా నిర్వహించడం ద్వారా ప్రవాస తెలంగాణ ప్రజలు తమ సంస్కృతి, సాంప్రదాయాలపై ఉన్న మమకారాన్ని చాటిచెప్పారు. ఉటాలో నివసిస్తున్న తెలంగాణవాసులు ఒకచోట చేరి బతుకమ్మ వేడుకల్లో పాల్గొనడం, తమ సాంస్కృతిక వారసత్వాన్ని భావితరాలకు పరిచయం చేసే ప్రయత్నంగా నిలిచింది.

**బతుకమ్మ వేడుకల నిర్వహణలో నవీన్ జాదవ్ కీలక పాత్ర**

జిటిఎ ఉటా చాప్టర్ అధ్యక్షులు పట్లోళ్ల విశాల్ రెడ్డి నాయకత్వంలో నిర్వహించిన ఈ వేడుకల్లో వాలంటీర్ అండ్ స్పోర్ట్స్ కోఆర్డినేటర్ నవీన్ జాదవ్‌తో పాటు బోర్డు సభ్యులు విష్ణు, భరత్, వినీల్, ఉదయ్, సాయికిరణ్ మూగ, శ్రావ్య, కార్తీక్, సాయికిరణ్ బచ్చు, దినేష్, సంతోష్, క్రాంతి, కరుణాకర్, అపూర్వ, నిఖిల తదితరులు తమ సహకారం అందించారు. కార్యక్రమం విజయవంతం కావడంలో కృషి చేసిన నిర్వాహకులు, వాలంటీర్లను పలువురు అభినందించారు.

**పెద్దేముల్ తండాకు గర్వకారణం**

పెద్దేముల్ తండాకు చెందిన నవీన్ జాదవ్ అమెరికాలో తెలంగాణ సంస్కృతికి సంబంధించిన వేడుకల నిర్వహణలో భాగస్వామి కావడం పట్ల గ్రామస్థులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. స్వదేశానికి వేల మైళ్ల దూరంలో ఉన్నప్పటికీ తమ మూలాలను మరచిపోకుండా పండుగలను నిర్వహించడం, తెలంగాణ సంస్కృతి గొప్పతనాన్ని ప్రపంచానికి చాటిచెప్పడం అభినందనీయమని పలువురు పేర్కొంటున్నారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను విదేశాల్లోనూ సజీవంగా నిలుపుతూ, ప్రవాస తెలంగాణ ప్రజలను ఒక్కతాటిపైకి తీసుకొస్తున్న జిటిఎ ఉటా చాప్టర్ నిర్వాహకులకు అభినందనలు వెల్లువెత్తుతున్నాయి.



# ఎంపీటీసీ, జడ్పిటిసి ఎన్నికల నియమావళిపై నాయకులకు అవగాహన కల్పించిన ఆర్‌ఓ

**నంద్యాల అక్టోబర్ 19(ప్రజాక్షేత్రం):**

పాములపాడులోని, ఎంపీడీవో కార్యాలయంలో ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఎంఎన్ వి.రాజు ఆధ్వర్యంలో అన్ని పార్టీల నాయకులకు ఎంపీటీసీ, జడ్పిటిసి నియమావళిపై అవగాహన కల్పించడం జరిగింది. ఈ సందర్భంగా పాములపాడు రిటర్నింగ్ అధికారి ఎంఎన్ వి రాజు మాట్లాడుతూ రెండవ సాధారణ ఎన్నికలు2026 ప్రకారము ఎన్నికల షెడ్యూలు ఈనెల 19 ఏది వస్తుందని, అభ్యర్థులు నామినేషన్లు అక్టోబర్21వ తేదీ నుండి 23వ తేదీ వరకు వేయాలని అన్నారు. ప్రతిరోజు సమయము ఉదయం 10 నుండి సాయంత్రం ఐదు గంటల వరకు ఉంటుందన్నారు. అక్టోబర్ 24వ తేదీన నామినేషన్ల పరిశీలన ఉంటుందని, అక్టోబర్25వ తేదీన ఎవరికైనా అభ్యంతరాలు ఉంటే అప్పీళ్ళు దాఖలు చేసుకోవచ్చని, అక్టోబర్26వ తేదీన అప్పీళ్ల పరిష్కారం ఉంటుందన్నారు. అక్టోబర్27వ తేదీన నామినేషన్ల ఉపసంహరణ ఉంటుందని, నవంబర్3వ తేదీన ఎన్నికలు జరుగుతాయన్నారు. నవంబర్4వ తేదీన అవసరమైతే రీపోలింగ్ ఉంటుందని, నవంబర్5వ తేదీన ఓట్ల లెక్కింపు, ఎన్నికల ఫలితాలు విడుదలవుతాయన్నారు.

జడ్పిటిసి, ఎంపీటీసీ ఎన్నికల షెడ్యూల్ ను ఆర్వో, ఎంపీడీవో ఎన్.చంద్రశేఖర్, సూపరెంటెండ్ తిరుపాలు, పంచాయతీ కార్యదర్శులు కృష్ణప్రియ, పుల్లయ్యలతో కలిసి నోటీసు బోర్డులో అతికించారు. ఎవరికైనా ఈ ఎన్నికల గురించి తెలియకుంటే ఈ నోటీస్ బోర్డులో చూసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ ఎంపీపీ అభ్యర్థి టేకూరి.రామసుబ్బమ్మ, మండల కన్వీనర్ జి.రవీంద్రారెడ్డి, నాయకులు బోనపల్లె వినయ్ కుమార్, జడ్పిటిసి అభ్యర్థి రాచపుడి. సురేష్, తెలుగు యువత మండల అధ్యక్షుడు షేక్.కరీం బాషా, మద్దూరు సొసైటీ చైర్మన్ వాడాల జనార్దన్ రెడ్డి, బిజెపి పార్టీ మండల అధ్యక్షుడు రాయపాటి మురళీమోహన్, నాయకులు చల్లా దామోదర్ రెడ్డి, జనసేన పార్టీ జిల్లా నాయకుడు రాము, సిపిఎం పార్టీ నాయకులు డి.స్వామన్న, టి.వెంకటేశ్వరరావు, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు సయ్యద్. షేక్షాఅలీ, వైఎస్ఆర్సిపి నాయకులు షేక్.హుస్సేన్ భాష, తదితర పార్టీల నాయకులు పాల్గొన్నారు.





# రాష్ట్ర బీజేవైఎం అధికార ప్రతినిధిగా భూతం సాయి రెడ్డి నియామకం

**ఆర్మూర్, అక్టోబర్ 19(ప్రజాక్షేత్రం):**

ఎమ్మెల్యే పైడి రాకేష్ రెడ్డి నివాసంలో సోమవారం ఉమ్మెడ గ్రామానికి చెందిన భూతం సాయి రెడ్డిని రాష్ట్ర బీజేవైఎం అధికార ప్రతినిధిగా నియమిస్తూ నియామక పత్రాన్ని ఎమ్మెల్యే రాకేష్ రెడ్డి అందజేశారు. ఈ సందర్భంగా సాయి రెడ్డి మాట్లాడుతూ.. మండల అధ్యక్షుడి స్థాయి నుండి జిల్లా, రాష్ట్ర స్థాయి పదవులు కేవలం బీజేపీ పార్టీలో మాత్రమే రావడం జరుగుతుందని అన్నారు. తనకు ఈ అవకాశం కల్పించిన ఎమ్మెల్యే రాకేష్ రెడ్డికి, ఎంపీ ధర్మపురి అరవింద్ కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. బీజేపీ పార్టీ బలోపేతం కోసం నిరంతరం కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్టేట్ కౌన్సిల్ మెంబర్ నాగ సురేష్, కిసాన్ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి గడ్డం చిన్నారెడ్డి, కిసాన్ మోర్చా నందిపేట్ మండల అధ్యక్షుడు సాయికుమార్, యువమోర్చా మండల ప్రెసిడెంట్ మంగులారపు నవీన్, ఎస్సీ మోర్చా నందిపేట్ మండల ప్రెసిడెంట్ గంధం గంగాధర్, ఐలాపూర్ మల్లన్న తదితరులు పాల్గొన్నారు.



# బ్యాతల శివశంకర్ మాదిగకు ఉద్యమ నివాళులు

**శంకర్ పల్లి అక్టోబర్ 19(ప్రజాక్షేత్రం):**

ఎమ్మార్పీఎస్ రంగారెడ్డి జిల్లా మాజీ కార్యదర్శి బ్యాతల శివశంకర్ మాదిగ దశదినకర్మ సందర్భంగా వారి స్వగ్రామమైన టంగటూరు, శంకర్ పల్లి మండలం, చేవెళ్లకు ఎమ్మార్పీఎస్, ఎంఎస్పి మరియు అనుబంధ విభాగాల నాయకుల బృందం వెళ్లి ఘనంగా నివాళులు అర్పించడం జరిగింది. పద్మశ్రీ మందకృష్ణ మాదిగ ఆదేశాల మేరకు తన దశదినకర్మ (11వ రోజు) కార్యక్రమంకు సంబంధించిన అన్ని ఏర్పాట్లు, సదుపాయాలను కుటుంబం మీద ఒక రూపాయి కూడా భారం పడకుండా మొత్తం ఎమ్మార్పీఎస్ నాయకత్వమే సిద్ధం చేయడం జరిగింది. ఉద్యమంలో శ్రమించిన కార్యకర్త అకాల మరణంతో వారి కుటుంబానికి అన్నీ తానై ఎమ్మార్పీఎస్ వ్యవహరించింది.. చావు రోజు, మంద కృష్ణ మాదిగ పరామర్శ సందర్భంగా ఆర్థిక సహకారాన్ని అందించడమే కాకుండా ఈరోజు 11వ రోజు కార్యక్రమానికి ఏలోటు లేకుండా కుటుంబము, వారి గ్రామము, వారి బంధువులు గర్వపడేలా ఎమ్మార్పీఎస్ నాయకత్వాన్ని చూసి నేర్చుకునేలా ఆదర్శవంతంగా ఇట్టి కార్యక్రమ బాధ్యతను నాయకత్వాన్ని సమన్వయం చేస్తూ నిర్వర్తించాము పద్మశ్రీ "మందకృష్ణ మాదిగ" ఆదేశాలను అమలు చేసిన చేవెళ్ల నియోజకవర్గ నాయకత్వానికి, నూతన మండల అధ్యక్షులు, కమిటీ బాధ్యులు, సీనియర్ నాయకులు, తోడ్పాటును అందించిన శ్రేయోభిలాషులైన ప్రతిఒక్కరికి ప్రత్యేకమైన ధన్యవాదములు తెలియజేస్తున్నాం.

**ఇదే ఉద్యమ స్ఫూర్తిని కొనసాగిద్దాం..**

ఆపదలో ఉన్నా, మనతో కష్టపడ్డ నాయకులు, కార్యకర్తలకు కష్టం వస్తే ఒకరికొకరం తోడుగా నిలుద్దాం.. ఎవరైనా అకాల మరణం చెందితే వారి కుటుంబాలకు అండగా నిలుద్దాం. ఈ నివాళిలో నాతోపాటుగా శివ మాదిగ తల్లిదండ్రులు అలాగే ఎంఎస్పి మాజీ జిల్లా అధ్యక్షులు రావుగళ్ళ బాబు మాదిగ, ఎమ్మార్పీఎస్ మాజీ రాష్ట్ర కార్యదర్శి గట్టగల్ల ప్రశాంత్ మాదిగ, ఎమ్మార్పీఎస్ మాజీ జిల్లా ఉపాధ్యక్షులు కాడిగల్ల ప్రవీణ్ కుమార్ మాదిగ, ఎంఎస్ఎఫ్ మాజీ జిల్లా అధ్యక్షులు నాని భానుప్రసాద్ మాదిగ, సీనియర్ నాయకులు ఊరేంట ప్రవీణ్ మాదిగ, పుట్లగారి గణేష్ మాదిగ, నరేందర్ మాదిగ, కట్ట జగన్ మాదిగ, సింగదాసరి నరేష్ మాదిగ, ప్రేమ్ కుమార్ మాదిగ, బి.శ్రీనివాస్ మాదిగ వివిధ మండల అధ్యక్షులు శంకర్ పల్లి లింగంసాయి మాదిగ, చేవెళ్ల గుండాల మల్లేష్ మాదిగ, మొయినాబాద్ కుమార్ మాదిగ, దర్గుపల్లి రాజు మాదిగ, షాబాద్ మల్కి ప్రవీణ్ మాదిగ, సీనియర్ నాయకులు దాసరి నాగేష్ మాదిగ, జంగయ్య మాదిగ, నర్సింహా మాదిగ, లక్ష్మయ్య మాదిగ, యాదగిరి మాదిగ, వెంకటేష్ మాదిగ, తదితరులు పాల్గొన్నారు.

# మున్సిపల్ సిబ్బంది సేవలు మరువలేనివి

- మాజీ సర్పంచ్ రెడ్డిశెట్టి మధుసూదన్ గుప్తా

**చేవెళ్ల, అక్టోబర్ 19(ప్రజాక్షేత్రం):**

మున్సిపల్ సిబ్బంది సేవలు మరువలేనివని దామరగిద్ద మాజీ సర్పంచ్ రెడ్డి శెట్టి మధుసూదన్ గుప్తా అన్నారు. విజయదశమి (దసరా పండుగ) సందర్భంగా చేవెళ్ల మున్సిపల్ 9వ వార్డు సిబ్బందికి మాజీ ఉపసర్పంచ్ మాల వెంకటయ్యతో కలిసి నూతన వస్త్రాలను అందజేశారు. ప్రజల ఆరోగ్యం, పట్టణ పరిశుభ్రత కోసం సిబ్బంది చేస్తున్న సేవలు అభినందనీయమని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఉపసర్పంచ్ మాల వెంకటయ్య, కార్మికులు తదితరులు పాల్గొన్నారు.



# పక్కింటి వారి మాటలు భరించలేక ఉరి వేసుకొని మహిళ మృతి.

- చిట్టిగిద్ద గ్రామంలో వివాహిత మహిళ మృతి
- మృతురాలి తండ్రి ఉంగరం నర్సింలు ఫిర్యాదు.
- కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపిన ఎస్సై కె. గిరి పోలీస్ సిబ్బంది.

**నవబుపేట అక్టోబర్ 19(ప్రజాక్షేత్రం):**



చిట్టిగిద్ద గ్రామానికి చెందిన సుమలత భర్త అయ్యగల్ల ఆశీర్వాదం వయస్సు (27) అనే వివాహిత మహిళ మృతి ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేయడం జరుగుతుంది. పోలీసులకు అందిన ప్రాథమిక సమాచారం ప్రకారం, సుమలతకు సుమారు 10 సంవత్సరాల క్రితం ఆయాగళ్ళ ఆశీర్వాదంతో వివాహం జరిగింది. వీరికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఈ నెల 16వ తేదీన ఉదయం సుమలత కుమార్తె అనన్యశ్రీ ఇంటి ముందు ఆడుకుంటుండగా, ఉదయాన్నే ఎందుకు ఆడుకుంటున్నావని ఆమెను మందలించినట్లు సమాచారం. ఈ సమయంలో ఆ మాటలు విన్న వారి పాలివారైనా ఇంటి పక్కనే వారు పెద్ద అనిత, చిన్న అనిత మరియు చిన్న అనిత భర్త ఆనందం కలిసి సుమలతను దూషించినట్లు సమాచారం. ఈ విషయాన్ని సుమలత తన భర్త ఆశీర్వాదానికి తెలియజేయగా, ఆయన కూడా ఆమెను మందలించినట్లు సమాచారం. ఈ పరిణామాల నేపథ్యంలో సుమలత తీవ్ర మనస్తాపానికి గురైనట్లు ప్రాథమికంగా తెలుస్తోంది. అనంతరం, 18102024న సాయంత్రం సమయంలో సుమలత ఉరివేసుకునగ అది చూసి తన భర్త ఉరి వేసుకున్న తాడును కోసి కొనఊపిరితో ఉన్న తన భార్యని దగ్గరలో ఉన్న గవర్నమెంట్ హాస్పిటల్ వికారాబాద్ కి తీసుకువచ్చిన కొద్దిసేపటికి మృతి చెందినట్లు సమాచారం. ఈ ఘటనపై కేసు నమోదు చేసిన, మృతికి గల కారణాలు, ఘటనకు దారి తీసిన పరిస్థితులు మరియు సంబంధిత వ్యక్తుల పాత్రపై అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తున్నారు. దర్యాప్తులో వెల్లడయ్యే వాస్తవాల ఆధారంగా తదుపరి చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుంది.

# విజయశమి శుభాకాంక్షలు తెలిపిన ఎమ్మెల్యే పైడి

**నిజామాబాదు అక్టోబర్ 19(ప్రజాక్షేత్రం):**

ప్రజలు అన్ని పనులు విజయం చేకూరాలని దుర్గమ్మ ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని ప్రతి ఒక్కరూ పండుగను సుఖసంతోషాలతో జరుపుకోవాలని అధికారులకు, నాయకులకు నియోజకవర్గ ప్రజలకు విజయదశమి శుభాకాంక్షలు తెలియజేయడం జరిగింది.



# పేదల సేవకుడు చిట్టెపు ప్రకాష్ రెడ్డి.. ఆయన సేవలు చిరస్మరణీయం

- చిట్టెపు ప్రకాష్ రెడ్డి స్మారక సర్కిల్ ప్రారంభోత్సవంలో... తాండూరు మాజీ ఎమ్మెల్యే పైలట్ రోహిత్ రెడ్డి

**పెద్దేముల్, అక్టోబర్ 19(ప్రజాక్షేత్రం):**

నిరుపేద ప్రజలకు అండగా నిలిచి, వారి కష్టసుఖాల్లో భాగస్వామిగా ఉంటూ సేవలందించిన స్వర్గీయ చిట్టెపు ప్రకాష్ రెడ్డి సేవలు ఎప్పటికీ మరువలేనివని మాజీ ఎమ్మెల్యే పైలట్ రోహిత్ రెడ్డి అన్నారు. పేదలకు చేసిన సేవలు, ప్రజలతో ఏర్పరచుకున్న ఆత్మీయ అనుబంధం ఒక వ్యక్తిని ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలుపుతాయని పేర్కొన్నారు. సోమవారం పెద్దేముల్ మండల కేంద్రంలోని తెలంగాణ గ్రామీణ బ్యాంకు ఎదుట స్వర్గీయ చిట్టెపు ప్రకాష్ రెడ్డి స్మారకార్థం నిర్మించిన చిట్టెపు ప్రకాష్ రెడ్డి సర్కిల్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఆయన కుమారులు చిట్టెపు రాఘవేందర్ రెడ్డి, చిట్టెపు శ్రీకాంత్ రెడ్డి లతో పాటు స్థానిక నాయకులతో కలిసి మాజీ ఎమ్మెల్యే పైలట్ రోహిత్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా చిట్టెపు ప్రకాష్ రెడ్డి సేవలను స్మరించుకున్నారు. మాజీ ఎమ్మెల్యే రోహిత్ రెడ్డి మాట్లాడుతూ..సమాజంలో ఆర్థికంగా వెనుకబడిన నిరుపేదలకు సహాయ సహకారాలు అందించడం, అవసరమైన సమయంలో వారికి అండగా నిలవడం గొప్ప మానవీయ లక్షణమని ఈ సందర్భంగా పలువురు పేర్కొన్నారు. స్వర్గీయ చిట్టెపు ప్రకాష్ రెడ్డి స్మారకార్థం సర్కిల్ ఏర్పాటు చేయడం ఆయన పట్ల కుటుంబ సభ్యులకు, అభిమానులకు ఉన్న గౌరవాభిమానాలకు నిదర్శనమని అన్నారు. ఆయన పేరు భావితరాలకు పరిచయం కావడంతో పాటు, సమాజ సేవ ప్రాధాన్యతను గుర్తుచేసేలా ఈ స్మారక సర్కిల్ నిలుస్తుందని అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు,బీఆర్ఎస్ మండల సీనియర్ నాయకులు, కుటుంబ సభ్యులు, అభిమానులు, గ్రామస్తులు పాల్గొన్నారు.



# ప్రజల జీవితాల్లో విజయాల వెలుగులు నిండాలి

- **దసరా చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీక.**
- **జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు కే శివసేన రెడ్డి.**

**వనపర్తి, అక్టోబర్ 19(ప్రజాక్షేత్రం):**



వనపర్తి జిల్లా నియోజకవర్గ ప్రజలందరూ విజయదశమి పండుగను ఆనందోత్సాహాలతో జరుపుకోవాలని జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు శివసేన రెడ్డి ఆకాంక్షించారు. ఈ సందర్భంగా జిల్లా ప్రజలకు ఆయన సోమవారం దసరా శుభాకాంక్షలు తెలిపారు. చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీకగా విజయదశమి పండుగ నిలుస్తుందని పేర్కొన్నారు. దుర్గా మాత ఆశీస్సులతో ప్రజలందరి జీవితాల్లో సుఖసంతోషాలు వెల్లివిరియాలని, ప్రతి కుటుంబం ఆయురారోగ్యాలు, సిరిసంపదలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు. దసరా పండుగ ప్రజల్లో నూతన ఉత్సాహాన్ని నింపాలని, ప్రతి ఒక్కరూ ఆశయ సాధనలో విజయాలు అందుకోవాలని కోరారు. పండుగలు మన సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకలని, ప్రజల మధ్య ప్రేమానురాగాలు, పరస్పర గౌరవం, ఐక్యతను పెంపొందిస్తాయని శివసేన రెడ్డి పేర్కొన్నారు. కులమతాలకు అతీతంగా ప్రజలంతా సోదరభావంతో మెలుగుతూ పండుగలను కలిసికట్టుగా జరుపుకోవాలని పిలుపునిచ్చారు. సమాజంలో శాంతి, సామరస్యం వెల్లివిరిసి ప్రతి ఒక్కరికీ మంచి జరగాలని ఆకాంక్షించారు. విజయదశమి స్ఫూర్తితో ప్రజలంతా నూతన లక్ష్యాలతో ముందుకు సాగాలని, జిల్లా అభివృద్ధిలో భాగస్వాములు కావాలని ఆయన కోరారు. ఈ దసరా ప్రతి ఇంటా ఆనందాన్ని నింపడంతోపాటు ప్రజల జీవితాల్లో నూతన వెలుగులు తీసుకురావాలని, జిల్లా ప్రజలందరికీ విజయాలు చేకూరాలని శివసేన రెడ్డి ఆకాంక్షించారు.

# శరన్నవరాత్రి ఉత్సవాల్లో భక్తులకు అన్నప్రసాద వితరణ!

- **ఇరవెండిలో వైభవంగా దేవి శరన్నవరాత్రి వేడుకలు.**
- **అన్నదానాన్ని ప్రారంభించిన తాళ్లూరి పంచాక్షరయ్య.**

**బూర్గంపాడు, అక్టోబర్ 19(ప్రజాక్షేత్రం):**

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బూర్గంపాడు మండలం ఇరవెండి గ్రామంలో దేవి శరన్నవరాత్రి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో, వైభవంగా కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా సోమవారం అమ్మవారి సన్నిధిలో భక్తులకు అన్నప్రసాద వితరణ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. తాళ్లూరి చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ తాళ్లూరి పంచాక్షరయ్య ఈ అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. తొలుత అమ్మవారిని దర్శించుకున్న తాళ్లూరి పంచాక్షరయ్య ప్రత్యేక పూజలు నిర్వహించి అమ్మవారి ఆశీస్సులు పొందారు. అనంతరం ఉత్సవ కమిటీ సభ్యులు ఆయనను శాలువాతో ఘనంగా సన్మానించి, తీర్థప్రసాదాలు అందజేశారు. తదుపరి అన్నప్రసాద వితరణ కార్యక్రమాన్ని ప్రారంభించగా, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అన్నప్రసాదాన్ని స్వీకరించారు. దేవి శరన్నవరాత్రి ఉత్సవాల సందర్భంగా అమ్మవారి సన్నిధిలో అన్నదానం నిర్వహించడం పట్ల భక్తులు హర్షం వ్యక్తం చేశారు. ఆధ్యాత్మిక కార్యక్రమాలతో పాటు సేవా కార్యక్రమాలకు ప్రాధాన్యతనిస్తూ భక్తులకు అన్నప్రసాదం అందించడం అభినందనీయమని పలువురు పేర్కొన్నారు. ఇటువంటి కార్యక్రమాలు భక్తి భావాన్ని పెంపొందించడంతో పాటు సేవా స్ఫూర్తిని చాటిచెబుతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో తాళ్లూరి చారిటబుల్ ట్రస్ట్ డైరెక్టర్ వల్లూరిపల్లి వంశీకృష్ణ, బూర్గంపాడు సొసైటీ చైర్మన్ బిక్కసాని శ్రీనివాసరావు, ఉత్సవ కమిటీ సభ్యులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.



# ఆసియా పారా గేమ్స్‌లో భారత్ పతకాల వేట షురూ.. షూటింగ్‌లో స్వర్ణం, రజతం

- **ఆసియా పారా గేమ్స్‌లో భారత్‌కు శుభారంభం**
- **మహిళల 10 మీటర్ల ఎయిర్ రైఫిల్‌లో మోనాకు స్వర్ణం**
- **అవనీ లేఖరాకు రజత పతకం**
- **గేమ్స్ రికార్డు స్కోర్‌తో స్వర్ణం సాధించిన మోనా అగర్వాల్**
- **పోటీల తొలిరోజే పతకాల ఖాతా తెరిచిన భారత్**

**ప్రజాక్షేత్రం :**

జపాన్‌లోని ఐచినగోయాలో జరుగుతున్న 2026 ఆసియా పారా గేమ్స్‌లో భారత్‌కు అదిరిపోయే ఆరంభం లభించింది. పోటీల తొలిరోజైన సోమవారం, భారత పారా షూటర్లు పతకాల వేట ప్రారంభించారు. మహిళల 10 మీటర్ల ఎయిర్ రైఫిల్ స్టాండింగ్ ఎస్‌హెచ్1 విభాగంలో భారత క్రీడాకారిణులు మోనా అగర్వాల్ స్వర్ణం, అవనీ లేఖరా రజతం సాధించి దేశానికి గర్వకారణంగా నిలిచారు. ఈ గేమ్స్‌లో భారత్‌కు ఇవే తొలి పతకాలు కావడం విశేషం.

హోరాహోరీగా సాగిన ఫైనల్‌లో మోనా అగర్వాల్ 250.0 పాయింట్లతో ఆసియా పారా గేమ్స్ రికార్డు సృష్టించి స్వర్ణ పతకాన్ని కైవసం చేసుకుంది. కేవలం 0.4 పాయింట్ల స్వల్ప తేడాతో డిఫెండింగ్ ఛాంపియన్ అవనీ లేఖరా వెనుకబడింది. అవనీ 249.6 పాయింట్లతో రజత పతకంతో సరిపెట్టుకుంది. దక్షిణ కొరియాకు చెందిన లీ యున్రి 227.9 పాయింట్లతో కాంస్య పతకం గెలుచుకుంది.

అంతకుముందు జరిగిన క్వాలిఫికేషన్ రౌండ్‌లో కూడా భారత షూటర్లే ఆధిపత్యం ప్రదర్శించారు. మోనా అగర్వాల్ 629.1 పాయింట్లతో గేమ్స్ రికార్డు నెలకొల్పి అగ్రస్థానంలో నిలవగా, అవనీ లేఖరా 626.4 పాయింట్లతో రెండో స్థానంలో నిలిచి ఫైనల్స్‌కు అర్హత సాధించింది. తొలిరోజే రెండు పతకాలతో భారత్ ఈ మెగా ఈవెంట్‌లో తన ప్రస్థానాన్ని ఘనంగా ప్రారంభించింది.



# సర్వీస్ రికార్డులు డిజిటల్.. బకాయిలు మాత్రం పెండింగ్!

- **ఉద్యోగుల సొమ్ముపై అంతులేని నిరీక్షణ**
- **ఈ-హెచ్‌ఆర్‌ఎంఎస్‌తో సేవా వ్యవహారాలకు ఆన్‌లైన్ పరిష్కారం..**
- **గ్రాట్యుటీ, జీపీఎఫ్, సరెండర్ లీవుల చెల్లింపులపై స్పష్టత ఏదీ?**

**వికారాబాద్ బ్యూరో అక్టోబర్ 19 (ప్రజాక్షేత్రం)**




ప్రభుత్వ ఉద్యోగుల సేవా రికార్డులను డిజిటలైజేషన్ చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఉద్యోగంలో చేరినప్పటి నుంచి పదవీ విరమణ వరకు బదిలీలు, పదోన్నతులు, సెలవులు, ఇంక్రిమెంట్లు సహా సేవా వివరాలన్నింటినీ ఆన్‌లైన్‌లో నమోదు చేసే విధానాన్ని అమల్లోకి తీసుకురానుంది. తెలంగాణ ఇంటిగ్రేటెడ్ ఫైనాన్స్ మేనేజ్‌మెంట్ అండ్ ఇన్ఫర్మేషన్ సిస్టమ్ (టీఐఎఫ్ఎంఐఎస్)లో భాగంగా ఈహెచ్‌ఆర్‌ఎంఎస్ వ్యవస్థను అన్ని ప్రభుత్వ శాఖల్లో అమలు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. అయితే, ఉద్యోగుల సేవా వివరాలను డిజిటల్ చేయడంపై చూపుతున్న శ్రద్ధకు అనుగుణంగా, వారికి రావాల్సిన ఆర్థిక ప్రయోజనాల చెల్లింపులపైనా ప్రభుత్వం దృష్టి సారించాలనే డిమాండ్ వినిపిస్తోంది.

ప్రస్తుతం అనేక శాఖల్లో సేవా రికార్డుల నిర్వహణ మాన్యువల్ పద్ధతిలో కొనసాగుతుండటంతో వివరాల నమోదు, పరిశీలన, పదోన్నతులు, బదిలీలకు సంబంధించిన ప్రక్రియల్లో జాప్యం ఎదురవుతున్నట్లు ప్రభుత్వం గుర్తించింది. ఈ సమస్యలకు పరిష్కారంగా సమీకృత డిజిటల్ వ్యవస్థను అందుబాటులోకి తీసుకురానుంది. ప్రతి ఉద్యోగికి ధ్రువీకరించిన డిజిటల్ సర్వీస్ రిజిస్టర్ నిర్వహించడం, దరఖాస్తుల స్థితిని ఆన్‌లైన్‌లో తెలుసుకునే అవకాశం కల్పించడం ఈ విధానం ప్రధాన ఉద్దేశం. అయితే, ఈ వ్యవస్థ సమర్థంగా పనిచేయాలంటే ఉద్యోగుల వివరాలను పూర్తిస్థాయిలో నమోదు చేయడంతోపాటు, వాటి ప్రామాణికతను నిర్ధారించాల్సిన బాధ్యత అధికారులపై ఉంటుంది.

డిజిటల్ రికార్డులకు తోడు.. చెల్లింపులకూ గడువు ఏదీ?

ఒకవైపు ఉద్యోగుల సేవా వివరాలను కంప్యూటరీకరించేందుకు చర్యలు తీసుకుంటున్న ప్రభుత్వం, మరోవైపు పదవీ విరమణ చేసిన ఉద్యోగులకు అందాల్సిన ప్రయోజనాల చెల్లింపుల్లోనూ వేగం పెంచాల్సిన అవసరం ఉంది. గ్రాట్యుటీ, జనరల్ ప్రావిడెంట్ ఫండ్ (జీపీఎఫ్), సరెండర్ లీవులు, తెలంగాణ ప్రభుత్వ జీవిత బీమా (టీజీఎల్ఐ), గ్రూప్ ఇన్సూరెన్స్, కమ్యూటేషన్ తదితర ప్రయోజనాలకు సంబంధించిన బకాయిల కోసం ఉద్యోగులు ఎదురుచూస్తున్నారని ఉద్యోగ వర్గాలు ఆవేదన వ్యక్తం చేస్తున్నాయి.

ఏళ్ల తరబడి ప్రభుత్వానికి సేవలందించిన ఉద్యోగులు పదవీ విరమణ అనంతరం తమకు రావాల్సిన సొమ్ము కోసం కార్యాలయాల చుట్టూ తిరగాల్సి రావడం ఆందోళన కలిగిస్తోంది. పదవీ విరమణ తర్వాత కుటుంబ పోషణ, వైద్య ఖర్చులు, పిల్లల చదువులు, గృహ రుణాలు వంటి బాధ్యతలు పెరిగే సమయంలో ఆర్థిక ప్రయోజనాలు అందకపోవడం వారి కుటుంబాలపై భారంగా మారుతోంది. ఈ నేపథ్యంలో బకాయిల చెల్లింపులకు స్పష్టమైన కార్యాచరణ రూపొందించి, ప్రతి క్లెయిమ్ పరిష్కారానికి గడువు నిర్ణయించాలనే డిమాండ్ బలపడుతోంది.

**వేల కోట్ల బకాయిలపై శ్వేతపత్రం విడుదల చేయాలి**

ఉద్యోగులు, విశ్రాంత ఉద్యోగులు, కాంట్రాక్టర్లకు సంబంధించిన బిల్లులు పెద్ద మొత్తంలో పెండింగ్‌లో ఉన్నాయని బాధిత వర్గాలు చెబుతున్నాయి. అయితే, మొత్తం బకాయిల పరిమాణం, విభాగాలవారీగా పెండింగ్‌లో ఉన్న మొత్తం, ఇప్పటివరకు చేసిన చెల్లింపులు, కొత్తగా పేరుకుపోతున్న బిల్లులపై సమగ్ర అధికారిక గణాంకాలు వెల్లడించాల్సిన అవసరం ఉంది.

ప్రతి నెలా సుమారు 500 మంది ఉద్యోగులు పదవీ విరమణ చేస్తుండగా, వారి ప్రయోజనాల కోసం నెలకు రూ.200 కోట్ల నుంచి రూ.250 కోట్ల వరకు అవసరమవుతున్నట్లు అందిన వివరాలు సూచిస్తున్నాయి. పాత బకాయిలను పరిష్కరించడంతోపాటు, కొత్తగా పదవీ విరమణ చేస్తున్న ఉద్యోగులకు చెల్లింపులు చేయాల్సి ఉండటంతో ఆర్థిక శాఖపై ఒత్తిడి పెరుగుతోంది. 2027 మార్చి నాటికి బకాయిలను గణనీయంగా తగ్గించాలంటే నెలకు సుమారు రూ.2,000 కోట్ల మేర నిధులు విడుదల చేయాల్సి ఉంటుందని పేర్కొంటున్న అంచనాలపైనా ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలి.

ఈ మొత్తాలకు సంబంధించిన అధికారిక లెక్కలు, నిధుల లభ్యత, చెల్లింపుల ప్రాధాన్యత క్రమాన్ని ప్రభుత్వం బహిరంగపరిస్తే పరిస్థితిపై స్పష్టత వస్తుంది. ఏ విభాగానికి ఎంత చెల్లించారు? ఇంకా ఎంత మొత్తం పెండింగ్‌లో ఉంది? ఏ కాలానికి చెందిన బిల్లులకు ప్రాధాన్యత ఇస్తున్నారు? అనే ప్రశ్నలకు సమాధానాలు లభించాలి.

**సచివాలయం చుట్టూ ప్రదక్షిణలు.. బాధితులకు అందని సమాచారం**

తమ సమస్యలను పరిష్కరించుకోవడానికి జిల్లాల నుంచి హైదరాబాద్‌కు వస్తున్న ఉద్యోగులు, విశ్రాంత ఉద్యోగులు సంబంధిత అధికారులను కలవలేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని బాధితులు చెబుతున్నారు. కార్యాలయాల్లోకి ప్రవేశం, అధికారులతో భేటీ, వినతుల స్వీకరణ వంటి అంశాల్లో ఎదురవుతున్న ఇబ్బందులు వారి నిరీక్షణను మరింత పెంచుతున్నాయి. కొందరు బాధితులకు టోకెన్లు ఇచ్చినా, సమస్య పరిష్కారంపై స్పష్టమైన సమాచారం అందడం లేదన్న ఆరోపణలున్నాయి.

ఈ పరిస్థితికి పరిష్కారంగా ఆర్థిక శాఖలో ప్రత్యేక హెల్ప్‌డెస్క్ ఏర్పాటు చేయాలి. పెండింగ్ బిల్లుల స్థితిని ఫోన్, ఆన్‌లైన్ గ్రీవెన్స్ పోర్టల్, ఎస్ఎంఎస్ ద్వారా తెలియజేసే విధానం తీసుకురావాలి. సాంకేతిక పరిజ్ఞానం అందుబాటులో లేని విశ్రాంత ఉద్యోగులకు ప్రత్యక్ష సహాయం అందించాలి. ఫైల్ ఏ అధికారి వద్ద ఉంది? ఏ కారణంతో నిలిచిపోయింది? ఎప్పుడు పరిష్కారమవుతుంది? అనే వివరాలను బాధితులకు తెలియజేయాలి.

**పారదర్శకతతోనే ప్రభుత్వంపై విశ్వాసం**

డిజిటలైజేషన్ వల్ల సేవా రికార్డుల నిర్వహణలో పారదర్శకత పెరగవచ్చు. పెండింగ్ దరఖాస్తులను గుర్తించడం, వాటి పరిష్కారాన్ని పర్యవేక్షించడం సులభమవుతుంది. అయితే, డిజిటల్ రికార్డులు అందుబాటులోకి వచ్చినంత మాత్రాన ఉద్యోగుల ఆర్థిక సమస్యలు పరిష్కారమైనట్లు కాదు. సేవా వివరాల నిర్వహణతో పాటు, ఉద్యోగులకు రావాల్సిన ప్రయోజనాల చెల్లింపుల్లోనూ సమయపాలన తప్పనిసరి.

ప్రభుత్వం పెండింగ్ బిల్లులపై శ్వేతపత్రం విడుదల చేసి, విభాగాలవారీగా బకాయిల వివరాలు వెల్లడించాలి. నెలవారీ నిధుల విడుదలకు కార్యాచరణ ప్రకటించి, దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న జీపీఎఫ్ ఫైనల్ పేమెంట్లు, సరెండర్ లీవులు, గ్రాట్యుటీ, వైద్య అత్యవసర క్లెయిమ్‌ల పరిష్కారానికి ప్రాధాన్యత ఇవ్వాలి. ఉద్యోగి సేవా ప్రస్థానాన్ని డిజిటల్‌గా నమోదు చేయడం ఎంత ముఖ్యమో.. ఆ ఉద్యోగి కష్టార్జితానికి సంబంధించిన ఆర్థిక ప్రయోజనాలను సకాలంలో అందించడం కూడా అంతే ముఖ్యం. డిజిటల్ పాలనకు అసలైన అర్థం రికార్డుల కంప్యూటరీకరణలోనే కాదు.. బాధితుడికి నిర్ణీత సమయంలో న్యాయం అందించడంలోనూ ఉంది.

# మొగిలిపాక చెరువుకు జలకళ.

- **రైతన్నలకు ఎంతో మేలు**

**వలిగొండ, అక్టోబర్ 19(ప్రజాక్షేత్రం):**

యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండలం వెల్వర్తి చెరువు నుంచి మొగిలిపాక చెరువులోకి నీరు చేరేలా మోటార్లకు మరమ్మతులు చేయించి, నీటి సరఫరా పునరుద్ధరణకు కృషి చేసిన ముద్దసాని కిరణ్ రెడ్డికి గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు. చెరువులో నీటి నిల్వలు పెరగడం వల్ల రైతులకు సాగునీటి అవసరాలు తీరడంతో పాటు భూగర్భ జలాలు పెరిగి బావులు, బోర్లలో నీటి మట్టాలు మెరుగుపడనున్నాయి. పశువులకు కూడా నీటి సౌకర్యం కలగనుంది. రైతుల సమస్యలను గుర్తించి సాగునీటి కోసం చొరవ తీసుకోవడం అభినందనీయమని గ్రామస్తులు పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్ జడిగే బుచ్చయ్య యాదవ్, ఉప సర్పంచ్ షేక్ సైదులు, గ్రామ శాఖ అధ్యక్షుడు భీమనబోయిన బిక్షపతి, వార్డు సభ్యులు గంట భాస్కర్, పబ్బు వెంకటేష్, పబ్బు శిరీష బాలకృష్ణ, మచ్చ సునీత స్వామి, పాల సంఘం చైర్మన్ అమీర్‌శెట్టి శ్రీనివాస్, మాజీ సర్పంచ్ జక్కుల శంకరయ్య, మాజీ ఎంపీటీసీ రమేష్, మాజీ ఉప సర్పంచ్ భీమనబోయిన నరసింహా, మాజీ పాల సంఘం చైర్మన్లు పబ్బు సత్తయ్య, జక్క ఇంద్రారెడ్డి, పాల సంఘం డైరెక్టర్ సింగం మహేష్ తదితరులు పాల్గొన్నారు.



# స్మార్ట్ రేషన్ కార్డులు పంపిణీ చేసిన సర్పంచ్

- **వలమల్ల మానస రాములు.**

**వలిగొండ అక్టోబర్ 17(ప్రజాక్షేత్రం):**

యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండలం చిత్తాపురం గ్రామంలో గ్రామ గ్రామ పరిపాలన అధికారి పరుశురాం స్థానిక సర్పంచ్ వల్లమల్ల మానస రాములు లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వం అర్హులైన పేద ప్రజలకు అందిస్తున్న సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. స్మార్ట్ రేషన్ కార్డుల ద్వారా రేషన్ సరుకులను మరింత సులభంగా అందించే విధంగా ప్రభుత్వం స్మార్ట్ కార్డులను అమలు చేసిందని అన్నారు. ప్రభుత్వ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికి అందే విధంగా కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ చిన్నం స్వామి వార్డ్ మెంబర్ రేషన్ డీలర్ వల్లమల్ల రత్నయ్య, వార్డ్ మెంబర్ కొంతం నవీన్, గ్రామస్తులు ఏనుగు శేఖర్ రెడ్డి వెంకన్న యాదయ్య బుచ్చమ్మ యుగేందర్ గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.



# మాజీ ఎంపీటీసీ గూడూరు లక్ష్మమ్మ సేవలు చిరస్మరణీయం

- **ఐలు రాష్ట్ర ఉపాధ్యక్షులు మామిడి వెంకట్ రెడ్డి**

**వలిగొండ, అక్టోబర్ 19(ప్రజాక్షేత్రం):**

యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండలంలోని పొద్దుటూరు-ఎదుళ్లగూడెం మాజీ ఎంపీటీసీ, మహిళా సంఘాల నాయకురాలు గూడూరు లక్ష్మమ్మ గ్రామాభివృద్ధికి, పేద ప్రజల సంక్షేమానికి చేసిన సేవలు మరువలేనివని ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్ (ఐలు) రాష్ట్ర ఉపాధ్యక్షులు మామిడి వెంకట్ రెడ్డి అన్నారు.ఎదుళ్లగూడెం గ్రామంలో జరిగిన లక్ష్మమ్మ అంత్యక్రియల్లో పాల్గొని పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎంపీటీసీగా పనిచేసిన సమయంలో గ్రామాల అభివృద్ధికి, పేదల సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేశారని కొనియాడారు. మహిళల హక్కుల పరిరక్షణ, మహిళా సంఘాల బలోపేతానికి ఆమె చేసిన సేవలు అభినందనీయమన్నారు. లక్ష్మమ్మ మరణం గ్రామ ప్రజలకు తీరని లోటని, ఆమె ఆశయాలను కొనసాగించడమే నిజమైన నివాళి అని పేర్కొన్నారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి తుర్కపల్లి సురేందర్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ కంచర్ల రామకృష్ణారెడ్డి, గూడూరు శివశాంత్ రెడ్డి, పడమటి దామోదర్ రెడ్డి, కళ్లెం సుదర్శన్ రెడ్డి, మామిడి పద్మారెడ్డి తదితరులు పాల్గొని నివాళులర్పించారు.



# జోగులాంబ అమ్మవారిని దర్శించుకున్న భవాని భక్తులు

**అడ్డాకుల అక్టోబర్ 19(ప్రజాక్షేత్రం):**

అడ్డాకుల మండల కేంద్రానికి చెందిన భవాని మాల వేసిన భక్తులు గద్వాల జిల్లా అలంపూర్ లో వెలసిన జోగులాంబ అమ్మవారిని సోమవారం దర్శించుకుని పూజలు నిర్వహించారు. ఎల్.నినో ప్రభావంతో అల్లాడిపోతున్న రాష్ట్రాన్ని కాపాడాలని, తెలంగాణ రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని అమ్మవారిని వేడుకున్నారు. ఈ కార్యక్రమంలో రేవంత్ గౌడ్, చంద్రయ్య యాదవ్, శంకర్ సాగర్, పవన్ కళ్యాణ్, గోవర్ధన్, దుర్గా, సింధు, నిరిత, లావణ్య, భావన, స్పందన, ఉమావతి, హేమలత, భవ్య శ్రీ, కృష్ణవేణి, అమ్ములు, లక్కీ, బబ్లు, ఉజ్వల్, పవన్ గౌడ్, జస్వంత్, జవాన్, చరణ్, విజయ్ పాల్గొన్నారు.



# సామాన్యుడి బడ్జెట్ తలకిందులు!

- పెరుగుతున్న ధరలు.. కుంగుతున్న కుటుంబాలు
- బియ్యం నుంచి వంటనూనె వరకు మోత.. ఆదాయం పెరగక, ఖర్చులు తగ్గక ఆర్థిక సంక్షోభం
- హైదరాబాద్ ఐటీ రంగంలో ఏఐ ప్రభావం.. ఉద్యోగాల కోతతో టెకీల్లో ఆందోళన
- భారంగా మారిన ఈఎంఐలు.. పల్లెల్లోనూ కిరాణా సరుకులకు అప్పులే దిక్కు
- లోన్ యాప్‌ల వలలో సామాన్యులు.. ఇంటి దస్తావేజుల తాకట్టుతో ప్రైవేట్ ఫైనాన్స్ ఉచ్చు

**వికారాబాద్ బ్యూరో అక్టోబర్ 19(ప్రజాక్షేత్రం):**

నిత్యావసర ధరల పెరుగుదల.. చాలీచాలని ఆదాయాలు.. పెరుగుతున్న అప్పులు.. భారంగా మారుతున్న నెలవారీ వాయిదాలు.. ఇవన్నీ కలిసి సామాన్య, మధ్యతరగతి కుటుంబాల ఆర్థిక పరిస్థితిని అతలాకుతలం చేస్తున్నాయి. ఒకవైపు వంటింటి ఖర్చులు పెరుగుతుంటే, మరోవైపు ఉద్యోగ భద్రతపై నీలినీడలు కమ్ముకుంటున్నాయి. పట్టణాల్లో జీతాలు, ఈఎంఐల మధ్య నలిగిపోతున్న కుటుంబాలు.. పల్లెల్లో వ్యవసాయ ఆదాయం సరిపోక అప్పుల బాట పడుతున్నాయి. పొదుపు కరిగిపోవడంతో అత్యవసర ఖర్చులకూ రుణాలపై ఆధారపడాల్సిన పరిస్థితి నెలకొంటున్నది. క్రెడిట్ కార్డులు, డిజిటల్ లోన్ యాప్‌లు, ప్రైవేట్ ఫైనాన్స్ సంస్థల వైపు ప్రజలు మొగ్గుచూపుతుండగా.. అప్పుల ఊబి నుంచి బయటపడటం అనేక కుటుంబాలకు సవాలుగా మారుతున్నది.

**వంటింటి బడ్జెట్‌కు ధరల సెగ**
**బియ్యం, పప్పులు, నూనెల ధరల పెరుగుదల..**
**నెలవారీ ఖర్చులకు అదనపు భారం**

నిత్యావసర సరుకుల ధరలు పెరగడంతో కుటుంబ బడ్జెట్ తారుమారవుతున్నది. అందుబాటులో ఉన్న ధరల వివరాల ప్రకారం.. జూలైలో కిలో రూ.52-55గా ఉన్న సాధారణ సోనా మసూరి బియ్యం ధర ప్రస్తుతం రూ.68-75కు చేరింది. 25 కిలోల సన్న బియ్యం బస్తా ధర రూ.1,350 నుంచి రూ.1,850కు పెరిగినట్లు పేర్కొంటున్నారు. కందిపప్పు కిలో ధర రూ.145 నుంచి రూ.175-180కు చేరింది. పామాయిల్ లీటర్ రూ.110 నుంచి రూ.140కు, సన్‌ఫ్లవర్ ఆయిల్ రూ.132 నుంచి రూ.168కు పెరిగాయి. చింతపండు కిలో రూ.160 నుంచి రూ.220కు, ఎండు మిర్చి రూ.240 నుంచి రూ.310కు చేరినట్లు వివరాలు వెల్లడిస్తున్నాయి.

కూరగాయల ధరల మార్పులు కూడా వంటింటి ఖర్చులపై ప్రభావం చూపుతున్నాయి. పిల్లల చదువులు, ఇంటి అద్దె, విద్యుత్ బిల్లులు, వైద్య ఖర్చులతో ఇప్పటికే ఇబ్బందులు పడుతున్న కుటుంబాలకు సరుకుల ధరల పెరుగుదల అదనపు భారంగా మారింది. ఫలితంగా నెలా ఖరులో చేతిలో డబ్బులు మిగలడం లేదు. అత్యవసర ఖర్చుల కోసం అప్పు చేయాల్సిన పరిస్థితి ఏర్పడుతున్నది.

**పొదుపు కరిగి.. జీవన ప్రమాణాలు పడిపోయి**
**పౌష్టికాహారానికి కోత.. వైద్య ఖర్చులకూ వెనుకడుగు**

ఆదాయం పెరగకపోవడం, ఖర్చులు పెరిగిపోవడంతో కుటుంబాల జీవన ప్రమాణాలు దెబ్బతింటున్నాయి. నెలవారీ ఆదాయంలో ఎక్కువ భాగం నిత్యావసరాలకే ఖర్చవుతుండటంతో పాలు, పండ్లు, గుడ్లు వంటి పోషకాహార పదార్థాల కొనుగోళ్లను తగ్గించుకుంటున్న కుటుంబాలు ఉన్నాయి. అనారోగ్య సమస్యలు వచ్చినప్పుడు వైద్యులను సంప్రదించకుండా మందుల దుకాణాల వద్ద మందులు కొనుగోలు చేసి సరిపెట్టుకునే పరిస్థితులూ కనిపిస్తున్నాయి. పిల్లల పాఠశాల ఫీజులు, పుస్తకాలు, రవాణా ఖర్చులు తల్లిదండ్రులకు భారమవుతున్నాయి. బ్యాంకు ఖాతాల్లో నిల్వలు తగ్గిపోవడం, అత్యవసర అవసరాలకు బంగారం తాకట్టు పెట్టడం వంటి పరిణామాలు కుటుంబాల ఆర్థిక భద్రతపై ప్రశ్నలు లేవనెత్తుతున్నాయి. ఆర్థిక ఒత్తిడి క్రమంగా మానసిక ఆందోళనకు దారితీస్తున్నది. ఆదాయం, ఖర్చుల మధ్య అంతరం పెరిగినప్పుడు దాని ప్రభావం కేవలం కుటుంబ బడ్జెట్‌కే పరిమితం కాకుండా ఆరోగ్యం, విద్య, జీవన నాణ్యతపైనా పడుతున్నది.

**ఏఐ ప్రభావం.. ఐటీ కొలువులకు ముప్పు**
**ఆటోమేషన్‌తో మారుతున్న ఉద్యోగ స్వరూపం.. ఈఎంఐల భారం మధ్య టెకీలు**

హైదరాబాద్ ఐటీ కారిడార్‌లో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ), ఆటోమేషన్ వినియోగం పెరుగుతుండటంతో ఉద్యోగుల భవిష్యత్తుపై ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. గచ్చిబౌలి, మాదాపూర్, హైటెక్ సిటీల్లో సాఫ్ట్‌వేర్, టెస్టింగ్, కస్టమర్ సపోర్ట్, కంటెంట్ వంటి విభాగాల్లో పనిచేసేవారికి నైపుణ్యాల మార్పు, ఉద్యోగ పోటీ సవాళ్లుగా మారుతున్నాయి. అయితే ఉద్యోగాల కోతకు ఏఐ ఒక్కటే కారణమని నిర్ధారించలేం; సంస్థల ఖర్చుల నియంత్రణ, మార్కెట్ పరిస్థితులు, వ్యాపార పునర్వ్యవస్థీకరణ కూడా ప్రభావం చూపవచ్చు.

ఉద్యోగం కోల్పోయినవారికి కొత్త కొలువు లభించేలోపు ఇంటి అద్దె, పిల్లల చదువులు, కార్ల రుణాలు, గృహ రుణాల వాయిదాలు భారంగా మారుతున్నాయి. నెలకు రూ.40 వేల నుంచి రూ.80 వేల వరకు ఈఎంఐలు చెల్లించే కుటుంబాలకు ఆదాయం నిలిచిపోతే పరిస్థితి మరింత క్లిష్టమవుతున్నది. మరోవైపు ఉద్యోగాల్లో కొనసాగుతున్నవారికి వేతన పెంపులు ఆశించిన స్థాయిలో లేకపోవడం, పనిభారం పెరగడం ఆర్థిక ఒత్తిడిని పెంచుతున్నాయి.

ఒకప్పుడు స్థిరమైన ఆదాయంతో భవిష్యత్తు ప్రణాళికలు వేసుకున్న ఉద్యోగులు ఇప్పుడు పొదుపు, ఖర్చుల విషయంలో మరింత జాగ్రత్తగా వ్యవహరించాల్సిన పరిస్థితి ఏర్పడుతున్నది. సాంకేతిక మార్పులకు అనుగుణంగా నైపుణ్యాల అభివృద్ధి, ఉద్యోగ భద్రత, రుణాల నిర్వహణ కీలకంగా మారుతున్నాయి.

**ఇంటి పత్రాలు తాకట్టు.. అప్పుల ఉచ్చు**
**తక్కువ సమయంలో రుణాల ఆశ.. వడ్డీలు, రుసుములతో పెరుగుతున్న భారం**



గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో అత్యవసర ఖర్చుల కోసం కొందరు ప్రైవేట్ ఫైనాన్స్ సంస్థలు, నాన్ బ్యాంకింగ్ ఫైనాన్షియల్ కంపెనీలను ఆశ్రయిస్తున్నారు. ఇంటి ఆస్తిపై రుణం తీసుకునే విధానంలో ఆస్తి పత్రాలను తాకట్టు పెట్టి నగదు పొందుతున్నారు. అయితే రుణం తీసుకునే ముందు వడ్డీ రేటు, ప్రాసెసింగ్ ఫీజులు, ఆలస్యపు రుసుములు, తిరిగి చెల్లించే మొత్తం వంటి అంశాలను పూర్తిగా పరిశీలించకపోతే అప్పు భారం పెరిగే ప్రమాదం ఉంది.

కిస్తీలు సకాలంలో చెల్లించలేని పరిస్థితుల్లో రికవరీ ఒత్తిడి ఎదురవుతుండటంతో కుటుంబాలు ఆందోళనకు గురవుతున్నాయి. రుణ ఒప్పందంలోని నిబంధనలు, వర్తించే చట్టపరమైన ప్రక్రియల ప్రకారమే ఆస్తిపై చర్యలు చేపట్టాల్సి ఉంటుంది. అయినప్పటికీ ఇంటిని కోల్పోతామనే భయం బాధిత కుటుంబాలను మరింత ఒత్తిడికి గురిచేస్తున్నది.

రాష్ట్రంలోని పలు జిల్లాల్లో క్రెడిట్ డిపాజిట్ నిష్పత్తి అధికంగా ఉన్నట్లు పేర్కొంటున్న గణాంకాలు రుణ ప్రవాహంపై చర్చకు దారితీస్తున్నాయి. మహబూబాబాద్, సూర్యాపేట, జనగామ, నాగర్‌కర్నూల్, జోగులాంబ గద్వాల జిల్లాల్లో అధిక నిష్పత్తులు నమోదైనట్లు అందించిన వివరాలు సూచిస్తున్నాయి. అయితే అధిక సీడీ నిష్పత్తి ఒక్కటే ప్రజలు అప్పుల్లో కూరుకుపోయారని లేదా ఆస్తులు కోల్పోతున్నారని నిరూపించదు. జిల్లాల వారీగా తాజా అధికారిక గణాంకాలు, రుణాల స్వభావం, తిరిగి చెల్లింపుల వివరాలను కలిపి పరిశీలించాల్సి ఉంటుంది.

**పల్లెల్లోనూ అప్పుల ఆందోళన**
**పంట పెట్టుబడులు పెరిగి.. ఆదాయం సరిపోక.. కిరాణా దుకాణాల్లో ఉద్దెర పెరుగుదల**

గ్రామీణ ప్రాంతాల్లో వ్యవసాయ పెట్టుబడులు, కుటుంబ అవసరాలు, వైద్య ఖర్చులు, పిల్లల చదువుల కోసం నగదు అవసరం పెరుగుతున్నది. పంటకు ఆశించిన ధర లభించకపోవడం లేదా ఆదాయం ఆలస్యంగా రావడం వల్ల కొన్ని కుటుంబాలు రోజువారీ ఖర్చుల కోసం అప్పులపై ఆధారపడుతున్నాయి. కిరాణా దుకాణాల్లో ఉద్దెర ఖాతాలు పెరగడం చిన్న వ్యాపారుల నగదు ప్రవాహంపైనా ప్రభావం చూపుతున్నది. బ్యాంకు రుణాలు వెంటనే అందుబాటులో లేకపోవడం వంటి కారణాలతో కొందరు తక్షణ రుణాల యాప్‌లను ఆశ్రయిస్తున్నారు. ఆధార్, పాన్ వివరాలతో నిమిషాల్లో రుణం ఇస్తామనే ప్రకటనలు ఆకర్షణీయంగా కనిపించినా, వాస్తవ వడ్డీ రేటు, రుణ కాలపరిమితి, ప్రాసెసింగ్ రుసుములు, ఆలస్యపు చార్జీలను తెలుసుకోకపోతే తిరిగి చెల్లింపులు కష్టమవుతాయి. కొన్ని అక్రమ యాప్‌ల నుంచి వ్యక్తిగత సమాచార దుర్వినియోగం, పరిచయస్తులకు సందేశాలు పంపి వేధించడం వంటి ఫిర్యాదులు కూడా వస్తుంటాయి.

మహిళా స్వయం సహాయక సంఘాల రుణాలు ఆదాయాన్ని పెంచే కార్యకలాపాలకు ఉపయోగపడాల్సి ఉండగా, కొన్ని కుటుంబాల్లో రోజువారీ అవసరాలకు మళ్లుతున్నాయనే ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. రుణం ద్వారా తాత్కాలికంగా అవసరం తీరినా, ఆదాయం పెరగకపోతే తిరిగి చెల్లింపుల భారం పెరిగే ప్రమాదం ఉంది.

**అప్పుల ఊబి నుంచి బయటపడేదెలా?**
**పొదుపు పునరుద్ధరణ.. పారదర్శక రుణాలు.. ఉపాధి భద్రతే కీలకం**

సామాన్య కుటుంబాల ఆర్థిక పరిస్థితిని మెరుగుపరచాలంటే నిత్యావసర ధరల నియంత్రణతో పాటు స్థిరమైన ఉపాధి, ఆదాయ వృద్ధి, అందుబాటులో ఉండే వైద్యం, విద్య వంటి అంశాలపై దృష్టి పెట్టాలి. బ్యాంకులు, ఆర్థిక సంస్థలు రుణ నిబంధనలను స్పష్టంగా వివరించాలి. తక్షణ రుణాల పేరుతో అధిక రుసుములు వసూలు చేసే అక్రమ యాప్‌లపై పర్యవేక్షణ పెరగాలి. ఉద్యోగాలు కోల్పోయినవారికి నైపుణ్యాభివృద్ధి, తిరిగి ఉపాధి పొందేందుకు సహాయక కార్యక్రమాలు అవసరం.

కుటుంబాల స్థాయిలోనూ ఆదాయం, ఖర్చులు, అప్పుల వివరాలను నమోదు చేసుకోవడం, అధిక వడ్డీ రుణాలకు దూరంగా ఉండడం, రుణ ఒప్పందాలను చదివి అర్థం చేసుకున్న తర్వాతే సంతకం చేయడం ముఖ్యం. ఇప్పటికే రుణభారం పెరిగినవారు కొత్త అప్పులతో పాత అప్పులు తీర్చే చక్రంలో చిక్కుకోకుండా బ్యాంకులు లేదా అర్హత కలిగిన ఆర్థిక సలహాదారులను సంప్రదించాలి.

ఒక కుటుంబం సంపాదించిన ఆదాయం ఆహారం, ఇల్లు, విద్య, వైద్యం వంటి కనీస అవసరాలకే సరిపోకపోతే ఆర్థిక వృద్ధి ఫలాలు సామాన్యుడికి ఎంతవరకు అందుతున్నాయన్న ప్రశ్న తప్పనిసరిగా తలెత్తుతుంది. అప్పు తాత్కాలిక ఉపశమనం ఇవ్వవచ్చు.. కానీ ఆదాయానికి మించిన ఖర్చులు, అధిక వడ్డీలు, అస్థిర ఉపాధి కొనసాగితే అదే అప్పు కుటుంబ భద్రతను దెబ్బతీస్తుంది. సామాన్యుడికి కావాల్సింది మరిన్ని అప్పులు కాదు.. సరిపడా ఆదాయం, స్థిరమైన ఉపాధి, అందుబాటులో ఉండే నిత్యావసరాలే.

# మండుతున్న ఎండలు.. ఎండుతున్న పంటలు!

- అడుగంటుతున్న భూగర్భ జలాలు.. ఆందోళనలో అన్నదాతలు.

**తాండూర్, అక్టోబర్ 19(ప్రజాక్షేత్రం):**

ప్రకృతి ప్రకోపానికి విలవిలలాడుతున్న రైతన్న.. పెట్టుబడులు నేలపాలు.. కళ్లముందే ఎండిపోతున్న పంటలను చూసి కన్నీటిపర్యంతం! ప్రకృతి కన్నెర్ర చేస్తోంది.. భానుడు నిప్పులు కురిపిస్తున్నాడు.. భూగర్భ జలాలు అడుగంటుతున్నాయి.. పచ్చగా కళకళలాడాల్సిన పంట పొలాలు ఎండిపోయి బీడుభూములను తలపిస్తున్నాయి. పంటల సాగు కోసం అప్పులు చేసి పెట్టుబడులు పెట్టిన రైతన్నకు చివరకు కన్నీళ్లే మిగులుతున్నాయి. ఆరుగాలం కష్టపడి పంటను కంటికి రెప్పలా కాపాడుకోవాల్సిన రైతు, నీటి కోసం నానా అవస్థలు పడుతున్నాడు. పంట చేతికొస్తుందన్న ఆశతో ఎదురుచూస్తున్న అన్నదాతకు ప్రకృతి పరీక్ష పెడుతోంది.

**మండుతున్న ఎండలు..**
**మాడిపోతున్న పంటలు**

రోజురోజుకూ పెరుగుతున్న ఉష్ణోగ్రతలు వ్యవసాయ రంగంపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయి. భూమిలో తేమ తగ్గిపోవడంతో పంటలు ఎదుగుదల కోల్పోతున్నాయి. నీరు అందక ఆకులు వాడిపోతున్నాయి. పంటను కాపాడుకోవడానికి రైతులు పొలాల చుట్టూ తిరుగుతూ నీటి కోసం ఎదురుచూస్తున్నారు. గంటల తరబడి మోటార్లు నడిపినా బోర్ల నుంచి ఆశించిన స్థాయిలో నీరు రావడం లేదని పలువురు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**అడుగంటుతున్న భూగర్భ జలాలు**

వర్షాలు సకాలంలో కురవకపోవడం, భూగర్భ జలాలపై అధికంగా ఆధారపడటం, నీటి వనరుల నిర్వహణలో లోపాలు వంటి అంశాలు అనేక ప్రాంతాల్లో సాగునీటి సమస్యను తీవ్రతరం చేస్తున్నాయి. ఒకప్పుడు సమృద్ధిగా నీటిని అందించిన బోర్లు నేడు నీటి కోసం ఎదురుచూసే పరిస్థితి ఏర్పడుతోంది. కొత్తగా బోర్లు వేయాలన్నా వేలాది రూపాయల ఖర్చు. వేసిన బోరులో నీరు పడుతుందో లేదో తెలియని అనిశ్చితి. ఇప్పటికే అప్పుల్లో ఉన్న రైతుకు మరోసారి పెట్టుబడి పెట్టడం భారంగా మారుతోంది. భూగర్భ జలాలు తగ్గిపోవడం కేవలం రైతుల సమస్య మాత్రమే కాదు. ఇది భవిష్యత్తు తాగునీటి అవసరాలపైనా ప్రభావం చూపే ప్రమాదం ఉంది. వర్షపు నీటిని భూమిలోకి ఇంకేలా చేయడం, చెరువులు, కుంటలను సంరక్షించడం, నీటి వృథాను అరికట్టడం వంటి చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉంది.

**పెట్టుబడులు నేలపాలు.. అప్పుల భారం మీద**

విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు, కూలీల ఖర్చులు రోజురోజుకూ పెరుగుతున్నాయి. సాగు ప్రారంభంలోనే అప్పులు చేసి పొలంలో పెట్టుబడులు పెట్టిన రైతు, పంట ఎండిపోతుంటే దిక్కుతోచని స్థితిలో పడుతున్నాడు. పంటను కాపాడుకోవడానికి అదనంగా డబ్బు ఖర్చు చేయాల్సి వస్తోంది. అయినా దిగుబడి వస్తుందన్న నమ్మకం లేకుండా పోతోంది.

పంట చేతికొస్తే అప్పులు తీర్చి కుటుంబ అవసరాలు తీర్చుకోవచ్చని భావించిన రైతుకు, పంట నష్టంతో ఆర్థిక భారం మరింత పెరుగుతోంది. పిల్లల చదువులు, కుటుంబ పోషణ, వైద్య ఖర్చులు.. ఇలా ఎన్నో బాధ్యతలు అన్నదాతను వెంటాడుతున్నాయి. పంట పొలంలో పచ్చదనం కనిపించాల్సిన చోట ఎండిన మొక్కలు దర్శనమిస్తుండటంతో రైతుల గుండెల్లో ఆందోళన పెరుగుతోంది.

**రైతు కన్నీళ్లు.. సమాజానికి హెచ్చరిక**

రైతు కష్టాన్ని అర్థం చేసుకోవాలంటే పంట పొలంలోకి వెళ్లి చూడాలి.తెల్లవారుజామునే పొలానికి వెళ్లి, సాయంత్రం చీకటి పడే వరకు శ్రమించే రైతుకు ప్రకృతి సహకరించకపోతే అతని పరిస్థితి ఎంత దయనీయంగా ఉంటుందో అర్థం చేసుకోవాలి. పంటను కాపాడుకోవడానికి నిద్రాహారాలు మాని కష్టపడుతున్న రైతన్నకు నీటి సమస్య పెద్ద సవాలుగా మారుతోంది. రైతు పంట పండిస్తేనే ప్రజలకు ఆహారం అందుతుంది. అలాంటి రైతు



సాగునీటి కోసం ఇబ్బందులు పడుతుంటే అది వ్యవసాయ రంగానికే కాకుండా సమాజానికి కూడా ఆందోళన కలిగించే అంశం. రైతు కష్టాన్ని గుర్తించి, పంటలను కాపాడేందుకు ప్రభుత్వ శాఖలు, వ్యవసాయ అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉంది.

**ఇప్పటికైనా మేల్కొనాలి.. నీటి సంరక్షణకు చర్యలు చేపట్టాలి!**

భూగర్భ జలాలను కాపాడుకోవడం నేటి అత్యవసర అవసరం. వర్షపు నీటి సంరక్షణకు ప్రాధాన్యం ఇవ్వాలి. చెరువులు, కుంటల్లో పూడికతీత చేపట్టి నీటి నిల్వ సామర్థ్యాన్ని పెంచాలి. పొలాల్లో నీటి వినియోగాన్ని తగ్గించే సూక్ష్మ సేద్య పద్ధతులపై రైతులకు అవగాహన కల్పించాలి. పంటల పరిస్థితిని వ్యవసాయ అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి, రైతులకు తగిన సలహాలు అందించాలి.

అలాగే పంట నష్టాన్ని అంచనా వేసి, అర్హులైన రైతులకు నిబంధనల ప్రకారం ప్రభుత్వ సహాయం అందేలా చర్యలు తీసుకోవాలి. వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా పంటల ఎంపిక, నీటి లభ్యతకు తగ్గ సాగు పద్ధతులపై రైతులకు మార్గదర్శకత్వం కల్పించాలి.



## నంద్యాల మున్సిపల్ కార్యాలయంలో ఉద్రిక్తత!

- మహిళా ఎంపీ దాడి జరిగిందని టీడీపీ నేతల ఆరోపణ!

**నంద్యాల అక్టోబర్ 19(ప్రజాక్షేత్రం):**

నంద్యాల మున్సిపల్ కార్యాలయంలో జరుగుతున్న నామినేషన్ల స్క్రూటినీ ప్రక్రియ సందర్భంగా వైసీపీ నాయకులు దౌర్జన్యానికి పాల్పడ్డారని టీడీపీ నాయకులు ఆరోపిస్తున్నారు. తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి, నంద్యాల ఎంపీ డా. బైరెడ్డి శబరిపై దాడి జరగడం అమానుషమని టీడీపీ నేతలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మహిళా ఎంపీపై దాడి జరిగిందన్న ఆరోపణలపై తక్షణమే విచారణ జరిపి, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని టీడీపీ నాయకులు డిమాండ్ చేస్తున్నారు. మున్సిపల్ కార్యాలయంలో శాంతిభద్రతలను కాపాడాలని, ఎన్నికల ప్రక్రియకు ఆటంకం కలిగించే వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు.

## పాములపాడు టీడీపీ ఎంపీపీ అభ్యర్థిగా టేకూరి రామసుబ్బమ్మ ఎంపిక

**నంద్యాల పాములపాడు అక్టోబర్ 19 (ప్రజాక్షేత్రం):**

తెలుగుదేశం పార్టీ పాములపాడు మండల ప్రజా పరిషత్ అధ్యక్ష (ఎంపీపీ) అభ్యర్థిగా వేంపెంట మాజీ సర్పంచ్ టేకూరి రామసుబ్బమ్మను జూటూరు, కోల్పు ఆనందాపురం గ్రామాల నాయకులు, కార్యకర్తలు, ప్రజలతో చర్చించి ఎంపిక చేసినట్లు నంద్యాల పార్లమెంట్ టీడీపీ ఇన్‌చార్జి మాండ్ర శివానందరెడ్డి, నందికొట్కూరు ఎమ్మెల్యే గిత్త జయసూర్య తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్టీఆర్ హయాం నుంచి నేటి వరకు సుమారు నాలుగు దశాబ్దాలుగా టేకూరి కుటుంబం పార్టీకి, ప్రజలకు విశేష సేవలు అందిస్తోందని పేర్కొన్నారు. వేంపెంట గ్రామ సీనియర్ నాయకుడు దివంగత టేకూరి గాండ్ల కృష్ణుడు, ఆయన సతీమణి, మాజీ సర్పంచ్ టేకూరి రామసుబ్బమ్మ, వారి కుమారుడు, సింగపూర్ తెలుగు సమాజం ఉపాధ్యక్షుడు, అంతర్జాతీయ సమాజ సేవకుడు, వరల్డ్ హ్యూమన్ రైట్స్ అవార్డు గ్రహీత డాక్టర్ టేకూరి నాగేశ్వరరావు సేవలను కొనియాడారు. వేంపెంట గ్రామం నుంచి సింగపూర్ వరకు రాజకీయాలకు, కులమతాలకు అతీతంగా మానవత్వంతో ఈ కుటుంబం అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తోందన్నారు. పేదలకు వస్త్రాల పంపిణీ, వారి పిల్లల చదువులకు ఆర్థిక సహాయం, అంత్యక్రియలకు ఆర్థిక సహకారం, పేద విలేకరులకు ఆర్థిక సాయం అందించడంతో పాటు గ్రామంలో ప్రజలకు అవసరమైన మౌలిక వసతుల కల్పనకు కృషి చేసిందని తెలిపారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, రాష్ట్ర ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పీ-4 బంగారు కుటుంబాలు కార్యక్రమంలో భాగంగా భానకచర్ల గ్రామంలోని, నిరుపేద వృద్ధ దంపతులకు లక్షల రూపాయలు వెచ్చించి ఇంటిని నిర్మించి ఇచ్చారని పేర్కొన్నారు. ఈ సేవా కార్యక్రమానికి గుర్తింపుగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, రాష్ట్ర ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ బాబు లు పంపిన బెస్ట్ సోషల్ అవార్డును రాష్ట్ర న్యాయ, మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండి.ఫరూక్, నంద్యాల జిల్లా కలెక్టర్ జి.రాజకుమారి గణియా ల చేతుల మీదుగా టేకూరి.రామసుబ్బమ్మ అందుకోవడం జరిగింది. ఇటువంటి అనేక సేవా కార్యక్రమాల ద్వారా టేకూరి కుటుంబం అందరి మన్ననలు పొందిందన్నారు. భారతదేశం నుంచి సింగపూర్‌కు వచ్చే వివిధ పార్టీల నాయకులు, ప్రముఖులు, ఇతరులకు ఆత్మీయ స్వాగతం పలికి, ఆతిథ్యం అందించే డాక్టర్ టేకూరి నాగేశ్వరరావు గొప్ప మనసున్న వ్యక్తి అని ప్రశంసించారు. ఆయన తల్లి టేకూరి రామసుబ్బమ్మ పాములపాడు మండలానికి టీడీపీ ఎంపీపీ అభ్యర్థిగా ఎంపిక కావడం సంతోషకరమన్నారు. జూటూరు-1 ఎంపీటీసీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న ఆమెను రాజకీయాలకు అతీతంగా, వర్గభేదాలను పక్కనపెట్టి, జూటూరు, కోల్పు ఆనందాపురం గ్రామాల నాయకులు, కార్యకర్తలు, ప్రజలు తమ అమూల్యమైన ఓటుతో భారీ మెజారిటీతో గెలిపించాలని పిలుపునిచ్చారు. అదేవిధంగా మండలంలోని, మొత్తం 12 ఎంపీటీసీ స్థానాల్లో టీడీపీ అభ్యర్థులను గెలిపించి, టేకూరి రామసుబ్బమ్మను మండల ప్రజా పరిషత్ అధ్యక్షురాలిగా ఎన్నుకునేందుకు సహకరించాలని కోరారు. మండలాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి పథంలో నడిపించేందుకు అందరూ సమష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. మా జూటూరు 1 ఎంపిటిసి అభ్యర్థి టేకూరి.రామసుబ్బమ్మ ను అందరితో కలిసికట్టుగా గెలిపించుకుంటామని టిడిపి నాయకులు షేక్.అబ్దుల్ హఫీజ్, మధు శేఖర్ యాదవ్, సుంకిరెడ్డి, ముర్తుజావలి, మాజీ ఉపసర్పంచ్ సలాం భాష, నాయకులు, కార్యకర్తలు, ప్రజలు వాగ్దానం చేశారు.





## యాత్రకు వెళ్లిన కుటుంబం ఇంట్లో చోరీ

- బంగారు కమ్మలు, వెండి పూజా సామగ్రి, నగదు అపహరణ

**మొయినాబాద్, అక్టోబర్ 19(ప్రజాక్షేత్రం)**

కుటుంబ సభ్యులతో కలిసి యాత్రకు వెళ్లిన ఇంట్లో గుర్తుతెలియని దొంగలు చోరీకి పాల్పడ్డారు. అమ్డాపూర్ గ్రామానికి చెందిన కట్కూరి రాజేష్ ఇంట్లో ఈ ఘటన చోటు చేసుకుంది. బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం.. ఈ నెల 15న కుటుంబ సభ్యులతో కలిసి యాత్రకు వెళ్లిన రాజేష్, తిరిగి 19న ఇంటికి చేరుకున్నాడు. అప్పటికే ఇంటి తాళం విరగ్గొట్టి ఉండటాన్ని గమనించాడు. లోపలికి వెళ్లి చూడగా బెడ్‌రూమ్‌లోని బీరువాలు పగలగొట్టి కనిపించాయి. వాటిలో భద్రపరిచిన 15 గ్రాముల



బంగారు కమ్మలు, 100 గ్రాముల వెండి పూజా సామగ్రితో పాటు కొంత నగదు కనిపించకుండా పోయాయి. ఇంట్లో ఎవరూ లేని సమయంలో గుర్తుతెలియని వ్యక్తులు చోరీకి పాల్పడినట్లు బాధితుడు ఫిర్యాదులో పేర్కొన్నాడు. ఈ ఘటనపై మొయినాబాద్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# తెలంగాణ సంస్కృతికి ప్రతీక బతుకమ్మ పండుగ

- సర్పంచ్ మద్యపాగ కృష్ణ

**మొయినాబాద్, అక్టోబర్ 19(ప్రజాక్షేత్రం):**

తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు బతుకమ్మ పండుగ ప్రతీకగా నిలుస్తుందని అమ్డాపూర్ గ్రామ సర్పంచ్ మద్యపాగ కృష్ణ అన్నారు. ఆయన ఆధ్వర్యంలో గ్రామంలో బతుకమ్మ సంబురాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మద్యపాగ కృష్ణ మాట్లాడుతూ.. బతుకమ్మ పండుగ మహిళల ఐక్యతకు, తెలంగాణ ఆత్మగౌరవానికి ప్రతీక అని పేర్కొన్నారు. ప్రకృతిని పూజిస్తూ పూలతో బతుకమ్మలను పేర్చి జరుపుకునే ఈ పండుగ మన సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబిస్తుందని అన్నారు. ప్రతి ఒక్కరూ సంప్రదాయాలను కాపాడుతూ, పండుగలను సంతోషంగా జరుపుకోవాలని పిలుపునిచ్చారు. గ్రామంలో బతుకమ్మ సంబురాలను ఆనందోత్సాహాల మధ్య నిర్వహించడం సంతోషంగా ఉందన్నారు.ఈ కార్యక్రమంలో గ్రామస్తులు, మహిళలు యువతీయువకులు పాల్గొన్నారు.



# స్వార్థపరులతో స్నేహం.. చివరకు ప్రమాదం!

- అవసరం ఉన్నంతవరకే అనుబంధం.. పని తీరాక ముఖం చాటేసే నైజం!
- మధురంగా మాట్లాడేవారంతా మిత్రులు కారు.. ఆపదలో అండగా నిలిచేవారే అసలైన స్నేహితులు

**వనపర్తి, అక్టోబర్ 16(ప్రజాక్షేత్రం):**



సమాజంలో మనిషి మనుగడకు స్నేహం ఎంతో అవసరం. అయితే ప్రతి స్నేహం స్వచ్ఛమైనది కాదు. కొందరు తమ అవసరాలు తీర్చుకోవడానికే స్నేహం ముసుగులో దగ్గరవుతారు. అవసరం ఉన్నంతకాలం ఆప్యాయంగా పలకరిస్తారు.. పనులు పూర్తయ్యాక కనీసం పలకరించడానికి కూడా వెనుకాడతారు. ఇలాంటి వారి వల్ల నిజమైన స్నేహానికి అర్థం మారడమే కాకుండా, నమ్ముకున్నవారు మానసిక వేదనకు గురవుతున్నారు.

**అవసరానికి దగ్గర.. ఆపదలో దూరం!**

స్వార్థపరులను గుర్తించడం అంత సులభం కాదు. ఎందుకంటే వారి మాటలు మధురంగా ఉంటాయి. ప్రవర్తనలో ఆప్యాయత కనిపిస్తుంది. మన అవసరాలను అడిగి తెలుసుకుంటారు. మనతో ఎంతో సన్నిహితంగా ఉన్నట్లు నటిస్తారు. కానీ వారి అంతరంగంలో మాత్రం స్వప్రయోజనమే ప్రధానంగా ఉంటుంది. అవసరం వచ్చినప్పుడు సహాయం కోరడం, తమ పనులు చక్కబెట్టుకోవడం, ప్రయోజనం పొందడం.. ఇదే వారి స్నేహానికి అసలు ఉద్దేశం. పని పూర్తయ్యాక మాత్రం మాట మారుతుంది. పలకరింపులు తగ్గుతాయి. ఫోన్ చేసినా స్పందన ఉండదు. కలిసేందుకు సమయం లేదంటారు. ఒకప్పుడు ఎంతో ఆత్మీయంగా మెలిగినవారు, ఇప్పుడు కనీసం పట్టించుకోకపోవడం బాధ కలిగిస్తుంది. ఇలాంటి అనుభవాలు ఎదురైనప్పుడు స్నేహం పేరుతో మనం ఎవరిని నమ్ముతున్నామో ఆలోచించాల్సిన అవసరం ఉంది.

**స్వార్థపరులను ఎలా గుర్తించాలి?**

**అవసరమైనప్పడే పలకరింపు:**

తమకు పని ఉన్నప్పుడే దగ్గరవుతారు. తమ అవసరాలు తీరగానే దూరమవుతారు. విజయాలను చూసి ఓర్వలేరు: మన ఎదుగుదలను మనస్ఫూర్తిగా అభినందించలేరు. పైకి సంతోషం వ్యక్తం చేసినా, లోలోపల అసూయపడుతుంటారు.

**బలహీనతలను అవకాశంగా మలుచుకుంటారు:**

మన రహస్యాలను తెలుసుకుని, అవసరమైనప్పుడు వాటినే మనకు వ్యతిరేకంగా ఉపయోగించేందుకు వెనుకాడరు.

**మాటలు ఎక్కువ.. చేతలు తక్కువ**

కష్టకాలంలో అండగా ఉంటామని చెబుతారు. కానీ నిజంగా సహాయం అవసరమైనప్పుడు అందుబాటులో ఉండరు.

**నిజమైన స్నేహానికి పరీక్ష కష్టకాలమే!**

స్నేహం అంటే కేవలం కలిసి తిరగడం, సరదాగా మాట్లాడుకోవడం, వేడుకల్లో పాల్గొనడం మాత్రమే కాదు. మన కష్టాన్ని తన కష్టంగా భావించడం, బాధలో ఓదార్పునివ్వడం, అవసరమైనప్పుడు అండగా నిలవడం నిజమైన స్నేహానికి నిదర్శనం. మన విజయాన్ని చూసి సంతోషించే వారు, వైఫల్యం ఎదురైనప్పుడు ధైర్యం చెప్పేవారు, తప్పు చేసినప్పుడు సరిదిద్దేవారు నిజమైన మిత్రులు.

**స్నేహం పేరుతో ప్రతి ఒక్కరినీ గుడ్డిగా నమ్మడం కూడా మంచిది కాదు.**

ఎదుటివారి మాటలకంటే వారి ప్రవర్తనను గమనించాలి. మన పట్ల వారి వైఖరి కాలక్రమంలో ఎలా మారుతుందో పరిశీలించాలి. అవసరానికి మాత్రమే దగ్గరయ్యే వారిని గుర్తించి, తగిన దూరం పాటించాలి. అదే సమయంలో ప్రతి ఒక్కరినీ అనుమానించడం కాకుండా, నిజాయతీగా మెలిగేవారికి తగిన విలువ ఇవ్వాలి.

**వ్యక్తిత్వమే అసలైన సంపద**

స్వార్థం కోసం ఏర్పడే బంధాలు ఎక్కువకాలం నిలవవు. పరస్పర గౌరవం, నమ్మకం, ఆప్యాయత, సహకారం ఉన్నప్పుడే స్నేహం బలపడుతుంది. ఇతరుల అవసరాలను తమ ప్రయోజనాలకు వాడుకోవడం కాకుండా, ఎదుటివారి కష్టసుఖాల్లో పాలుపంచుకోవడం అలవాటు చేసుకోవాలి. స్నేహం అనేది అవసరాలు తీర్చుకునే సాధనం కాదు.. కష్టసుఖాల్లో తోడుండే అనుబంధం. మాటలతో మోసం చేసేవారికంటే, చేతల్లో నిజాయతీ చూపేవారికే మన జీవితంలో స్థానం ఇవ్వాలి. స్వార్థపరులను గుర్తించడం ఎంత ముఖ్యమో, మనం ఇతరులకు నిజమైన స్నేహితులుగా ఉండటం కూడా అంతే ముఖ్యం.

# శంషాబాద్ పట్టణ ప్రజలకు విజయదశమి శుభాకాంక్షలు

- గ్రామ కమిటీ అధ్యక్షులు దేవేందర్.

**శంషాబాద్ అక్టోబర్ 19(ప్రజాక్షేత్రం):**

శంషాబాద్ పట్టణ ప్రజలకు చౌదరిగూడ గ్రామ కమిటీ అధ్యక్షులు దేవేందర్ విజయదశమి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం వారు మాట్లాడుతూ... పాలపిట్ట దర్శనంతో సకల శుభాలు జరగాలని, అలాయి బలాయి ఆత్మీయ అలింగనాలు, సంతోషాలతో అందరూ దసరా పండుగ జరుపుకోవాలని కోరుకుంటూ, చెడుపై మంచి సాధించిన విజయమే విజయదశమి అన్నారు.



# పేదల కన్నీళ్లు తుడిచిన సేవామూర్తి..స్వర్గీయ చిట్టెపు ప్రకాష్ రెడ్డి!

- నిరుపేదలకు అండగా నిలిచి.. ప్రజల హృదయాల్లో చెరగని ముద్ర
- చిట్టెపు ప్రకాష్ రెడ్డి సేవలు ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచి ఉంటాయి
- ప్రభుత్వ శాసనమండలి చీఫ్ విప్ పట్నం మహేందర్ రెడ్డి
- స్వర్గీయ చిట్టెపు ప్రకాష్ రెడ్డి సేవలకు గుర్తుగా సర్కిల్ ఏర్పాటు

**పెద్దేముల్, అక్టోబర్ 19(ప్రజాక్షేత్రం):**

కష్టాల్లో ఉన్న పేదవారికి అండగా నిలవడం, ఆపదలో ఉన్నవారికి చేయూతనివ్వడం, నిరుపేదల కళ్లలో కన్నీళ్లు తుడిచి వారి జీవితాల్లో ఆశలు నింపడం.. ఇవే ఒక మనిషిని ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిపే గొప్ప లక్షణాలు. అలాంటి సేవా గుణంతో ఎంతోమంది నిరుపేదలకు సహాయ సహకారాలు అందించిన స్వర్గీయ చిట్టెపు ప్రకాష్ రెడ్డి సేవలు ఎన్నటికీ మరువలేనివని ప్రభుత్వ శాసనమండలి చీఫ్ విప్ పట్నం మహేందర్ రెడ్డి అన్నారు. సోమవారం పెద్దేముల్ మండల కేంద్రంలోని తెలంగాణ గ్రామీణ బ్యాంకు ఎదుట స్వర్గీయ చిట్టెపు ప్రకాష్ రెడ్డి స్మారకార్థం నిర్మించిన చిట్టెపు ప్రకాష్ రెడ్డి సర్కిల్‌ను పట్నం మహేందర్ రెడ్డి ప్రారంభించారు. ఆయన కుమారులు చిట్టెపు రాఘవేందర్ రెడ్డి, చిట్టెపు శ్రీకాంత్ రెడ్డితో పాటు స్థానిక నాయకులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

**పేదల పట్ల సేవాభావం.. మరువలేని అనుబంధం**

ఈ సందర్భంగా పట్నం మహేందర్ రెడ్డి మాట్లాడుతూ.. స్వర్గీయ చిట్టెపు ప్రకాష్ రెడ్డి ఎంతోమంది నిరుపేదలకు అండగా నిలిచి, తనవంతు సహాయ సహకారాలు అందించారని గుర్తుచేశారు. సమాజంలో ఆర్థికంగా వెనుకబడినవారికి చేయూతనివ్వడం గొప్ప మానవీయ లక్షణమని, అలాంటి సేవలు ఒక వ్యక్తి జీవించి ఉన్నంత కాలమే కాకుండా, ఆయన అనంతరం కూడా ప్రజల మనసుల్లో నిలిచిపోతాయని పేర్కొన్నారు. ప్రకాష్ రెడ్డి అందించిన సేవలు ఆయన పట్ల ప్రజలకు ఉన్న అభిమానాన్ని, ఆత్మీయతను చాటిచెబుతున్నాయని అన్నారు.

**వ్యక్తి దూరమైనా.. సేవల జ్ఞాపకాలు పదిలం**

మనిషి భౌతికంగా దూరమైనా, సమాజం కోసం చేసిన మంచి పనులు ఎప్పటికీ చెరిగిపోవు. ముఖ్యంగా నిరుపేదలకు అండగా నిలిచి, వారి కష్టాల్లో భాగస్వాములైన వ్యక్తులను ప్రజలు తమ జ్ఞాపకాలలో పదిలంగా ఉంచుకుంటారు. స్వర్గీయ చిట్టెపు ప్రకాష్ రెడ్డి స్మారకార్థం సర్కిల్ ఏర్పాటు చేయడం ఆయనను స్మరించుకోవడంతో పాటు, ఆయన సేవలను భావితరాలకు గుర్తుచేసే ప్రయత్నంగా నిలుస్తుందని పలువురు పేర్కొన్నారు.

**సేవలకు చిరునామాగా స్మారక సర్కిల్**

పెద్దేముల్ మండల కేంద్రంలో ప్రధాన ప్రదేశంలో ఏర్పాటు చేసిన ఈ సర్కిల్ స్వర్గీయ చిట్టెపు ప్రకాష్ రెడ్డి పేరును ప్రజలకు గుర్తుచేయనుంది. ఒక వ్యక్తి సమాజానికి చేసిన సేవలను గుర్తించి, ఆయన జ్ఞాపకార్థం స్మారక నిర్మాణాన్ని ఏర్పాటు చేయడం ఆయన పట్ల కుటుంబ సభ్యులకు ఉన్న గౌరవాన్ని, అభిమానాన్ని ప్రతిబింబిస్తుంది. పేదలకు చేసిన సేవే నిజమైన సంపద అనే సందేశాన్ని ఇలాంటి స్మారకాలు సమాజానికి అందిస్తాయి.ఈ కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షులు జాదవ్ ధారాసింగ్,పెద్దేముల్ గ్రామ సర్పంచ్ డివై.నర్సింహులు,పెద్దేముల్ మండల పీఏసీఎస్ చైర్మన్ నల్లా యెల్లారెడ్డి, తట్టెపల్లి పీఏసీఎస్ చైర్మన్ పి.మహిపాల్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు గాజీపూర్ నారాయణ రెడ్డి,కే.శోభారాణి, పెద్దేముల్ మండల కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు పెండ్యాల ప్రవీణ్ కుమార్ గుప్తా,పెద్దేముల్ గ్రామ మాజీ సర్పంచ్ బాలప్ప, మాజీ ఎంపీటీసీ కిషన్ రావు,స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు, చిట్టెపు ప్రకాష్ రెడ్డి కుటుంబ సభ్యులు, అభిమానులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.





# విద్యార్థిని మృతి.. మరోవైపు రైతుల కన్నీటి గోస!

- ప్రత్యూష కుటుంబానికి మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి పరామర్శ.
- విద్యుత్తు కోతలతో ఎండిన వరి పంటలు పరిశీలన.
- నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్.

**వనపర్తి, అక్టోబర్ 19(ప్రజాక్షేత్రం):**

ఒకవైపు ఇంజినీరింగ్ విద్యార్థిని ప్రత్యూష (సోని) మృతి ఆ కుటుంబంలో తీరని విషాదాన్ని నింపగా.. మరోవైపు విద్యుత్తు కోతలతో వరి పంటలు ఎండిపోయి రైతులు కన్నీరు మున్నీరవుతున్నారు. ఈ రెండు ఘటనల నేపథ్యంలో మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి బాధిత కుటుంబాన్ని పరామర్శించి, పంట నష్టాలను పరిశీలించారు. బాధితులకు అండగా ఉంటామని భరోసా ఇచ్చారు.

**విద్యార్థిని మృతిపై దిగ్భ్రాంతి**

వనపర్తి పట్టణంలోని 14వ వార్డుకు చెందిన నారాయణదాస్ అశోక్‌చారి కవల కుమార్తెలు ప్రత్యూష (సోని), మీనా హైదరాబాద్‌లోని ఎంవీఎస్ఆర్ ఇంజినీరింగ్ కళాశాలలో బీటెక్ మొదటి సంవత్సరం చదువుతున్నారు. కళాశాలలో జరిగిన ఉత్సవంలో చోటుచేసుకున్న ప్రమాదంలో ప్రత్యూష మృతి చెందగా, ఆమె సోదరి మీనా తీవ్రంగా గాయపడి యశోద ఆసుపత్రిలో చికిత్స పొందుతోంది. ప్రత్యూష పార్థివదేహం సోమవారం వనపర్తిలోని స్వగృహానికి చేరుకోవడంతో మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి జిల్లా కేంద్రంలోని మృతురాలి నివాసానికి చేరుకొని పూలమాలలు సమర్పించి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఉజ్వల భవిష్యత్తు ఉన్న విద్యార్థిని అకాల మరణం చెందడం తీవ్ర విషాదకరమని, ఈ క్లిష్ట సమయంలో కుటుంబ సభ్యులకు మనోధైర్యం కలగాలని ఆకాంక్షించారు.

**ఆపదలో మిత్రుల అండ**

అశోక్‌చారి కుటుంబానికి చెందిన బాల్యమిత్రులు ఈ విషాద సమయంలో అండగా నిలిచారు. కుటుంబ సభ్యులకు ధైర్యం చెబుతూ, కళాశాల యాజమాన్యంతో మాట్లాడి బాధిత కుటుంబానికి న్యాయం జరిగేలా కృషి చేసినట్లు పేర్కొన్నారు. స్నేహితుడికి అండగా నిలిచిన వారిలో సూరి, విష్ణుసాగర్, గట్టు శశి, జీఆర్ బ్రదర్స్ రఘు, గుంట కృష్ణ, బాలరాజు, విజయ్‌తోపాటు పలువురు రాజకీయ నాయకులు, స్వర్ణకారులు ఉన్నారు.

**విద్యుత్తు కోతలతో 150 ఎకరాల్లో పంట నష్టం**

మరోవైపు, పెద్దగూడెం తండాలో విద్యుత్తు కోతల కారణంగా ఎండిపోయిన వరి పంటలను మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి బీఆర్ఎస్ నాయకులతో కలిసి పరిశీలించారు. తండాలో సుమారు 150 ఎకరాల్లో వరి పంట ఎండిపోయిందని రైతులు ఆయన దృష్టికి తీసుకొచ్చారు. ఎకరాకు రూ.25 వేల చొప్పున పెట్టుబడి పెట్టామని, పంట ఏపుగా పెరిగిన సమయంలో సక్రమంగా విద్యుత్తు సరఫరా కాకపోవడంతో నష్టపోయామని రూప్లానాయక్, దేశ్‌నాయక్, చందునాయక్, దూద్యానాయక్ తదితర రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా నిరంజన్‌రెడ్డి మాట్లాడుతూ..

రాష్ట్రంలో నెలకొన్నది ప్రకృతి తెచ్చిన కరువు కాదని, కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాల వల్ల ఏర్పడిన పరిస్థితి అని విమర్శించారు. పంటలు నష్టపోయిన రైతుల వివరాలను రాష్ట్రవ్యాప్తంగా సేకరించి, సమగ్ర సమీక్ష నిర్వహించి నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. విద్యుత్తు సరఫరాలో సమయపాలన లేకపోవడంతో పొలాలకు నీరు అందక పంటలు ఎండిపోతున్నాయని ఆరోపించారు. నీరున్నా.. పంటలకు అందని సాగునీరు

శ్రీశైలం ప్రాజెక్టులో నీటి లభ్యత ఉన్నప్పటికీ పాలమూరు, కల్వకుర్తి ఎత్తిపోతల పథకాల పంపులను పూర్తిస్థాయిలో నడపడం లేదని నిరంజన్‌రెడ్డి విమర్శించారు. పంపుల నిర్వహణ సరిగా లేక మరమ్మతులకు గురవుతున్నాయని ఆరోపించారు. గోదావరి, కృష్ణా జలాల వినియోగంలో ప్రభుత్వం ముందుచూపుతో వ్యవహరించడం లేదని అన్నారు. కృష్ణా జలాల్లో 100 టీఎంసీలు ఆంధ్రప్రదేశ్‌కు తరలిపోయాయని ఆరోపించారు. పెద్దగూడెం తండాలో గతంలో కేసీఆర్ ప్రభుత్వం 96 మంది గిరిజన రైతులకు భూములపై హక్కులు కల్పిస్తూ పట్టాలు ఇచ్చిందని, మరో 56 మందికి పట్టాలు ఇవ్వాల్సి ఉండగా ప్రస్తుత ప్రభుత్వం పట్టించుకోవడం లేదని పేర్కొన్నారు. అటవీ ప్రాంతంలో రెండు చెరువులు నిర్మించడం వల్ల భూగర్భ జలాలు పెరిగాయని, నీటి లభ్యత ఉన్నప్పటికీ విద్యుత్తు కోతల కారణంగా పంటలు ఎండిపోయాయని తెలిపారు.

వ్యవసాయంపై ప్రత్యక్షంగా, పరోక్షంగా కోట్లాది మంది ఆధారపడి ఉన్నారని, రైతుల సమస్యలను ప్రభుత్వం నిర్లక్ష్యం చేయడం తగదని అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రభుత్వ నిర్వహణలో విఫలమయ్యారని విమర్శించారు. నష్టపోయిన రైతులు అధైర్యపడవద్దని, వారికి న్యాయం జరిగే వరకు అండగా ఉండి ప్రభుత్వంపై పోరాడతామని భరోసా ఇచ్చారు. ప్రత్యూషకు నివాళులర్పించిన వారిలో వాకిటి శ్రీధర్, జ్యోతి రమణ, లక్ష్మీనారాయణ, ఉంగ్లం తిరుమల్, భాను, మోహనాచారి, గోకం శివ తదితరులు ఉన్నారు. పంటల పరిశీలనలో నందిమల్ల అశోక్, కె. మాణిక్యం, రఘువర్ధన్‌రెడ్డి, రవిప్రకాష్‌రెడ్డి, ధర్మానాయక్, మాధవ రెడ్డి, సునీల్ వాల్మీకి, శంకర్‌నాయక్, చిట్యాల రాము, నారాయణనాయక్, టీక్యానాయక్, గోవిందు నాయక్, అలీం తదితర బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



# బామ్నీ తండాలో నూతన ట్రాక్టర్ల ప్రారంభోత్సవం..

- పూజలు నిర్వహించి ట్రాక్టర్లను ప్రారంభించిన మాజీ ఎమ్మెల్యే జి. విట్టల్ రెడ్డి

**నిర్మల్ జిల్లా అక్టోబర్ 19(ప్రజాక్షేత్రం):**

తానూర్ మండలం బామ్నీ తండాకు చెందిన రాథోడ్ కరం సింగ్, జాదవ్ భరబ్ సింగ్ నూతనంగా కొనుగోలు చేసిన రెండు మహీంద్రా ట్రాక్టర్లను ముధోల్ మాజీ ఎమ్మెల్యే జి. విట్టల్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా గ్రామంలో నిర్వహించిన ప్రారంభోత్సవ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై, ట్రాక్టర్లకు ప్రత్యేక పూజలు నిర్వహించి ప్రారంభించారు. అనంతరం ట్రాక్టర్ల యజమానులు రాథోడ్ కరం సింగ్, జాదవ్ భరబ్ సింగ్‌తో పాటు వారి కుటుంబ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు. నూతన ట్రాక్టర్ల కొనుగోలుతో వారి వ్యవసాయ కార్యకలాపాలు మరింత సులభతరం కావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంతో బామ్నీ తండాలో సందడి నెలకొంది. గ్రామస్తులు, బంధువులు ట్రాక్టర్ల యజమానులకు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ సాగర భాయ్ రాజన్న, మాజీ ఆత్మ చైర్మన్ పోతరెడ్డి, కుబీర్ మార్కెట్ కమిటీ డైరెక్టర్ రాథోడ్ అరుణ్ కుమార్, బామ్నీ తండా సర్పంచ్ రాథోడ్ రోహిదాస్‌తో పాటు స్థానిక నాయకులు, గ్రామస్తులు, బంధువులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.




# కళాశాలలో ట్రస్ కూలి విద్యార్థిని మృతి..

- వనపర్తిలో బీజేపీ నేతల పరామర్శ.
- సోనా కుటుంబానికి ఓదార్పు.. గాయపడిన మీనా త్వరగా కోలుకోవాలని ఆకాంక్ష.

**వనపర్తి, అక్టోబర్ 19(ప్రజాక్షేత్రం):**

రంగారెడ్డి జిల్లా నాదల్ గుల్‌లోని ఎంవీఎస్ఆర్ ఇంజినీరింగ్ కళాశాలలో చోటుచేసుకున్న ప్రమాదంలో వనపర్తి జిల్లా కేంద్రానికి చెందిన బీటెక్ మొదటి సంవత్సరం విద్యార్థిని సోనా మృతి చెందగా, మరో విద్యార్థిని మీనా తీవ్రంగా గాయపడిన ఘటనపై బీజేపీ నాయకులు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈ విషాద ఘటన నేపథ్యంలో సోమవారం వనపర్తిలో బీజేపీ నాయకులు మృతురాలి కుటుంబ సభ్యులను వారి నివాసానికి వెళ్లి పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు.

నాదల్ గుల్‌లోని ఎంవీఎస్ఆర్ ఇంజినీరింగ్ కళాశాలలో ప్రమాదవశాత్తు లైటింగ్ ట్రస్ కూలడంతో ఈ ప్రమాదం చోటుచేసుకుంది. ఈ ఘటనలో బీటెక్ మొదటి సంవత్సరం చదువుతున్న సోనా మృతి చెందగా, మరో విద్యార్థిని మీనాకు తీవ్ర గాయాలయ్యాయి. చిన్న వయసులోనే విద్యార్థిని మృతి చెందడం బాధాకరమని బీజేపీ నాయకులు పేర్కొన్నారు.

బీజేపీ మాజీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అయ్యంగారి ప్రభాకర్‌రెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కేతూరి బుడ్డన్న, జిల్లా ప్రధాన కార్యదర్శి పెద్దిరాజు, జిల్లా మీడియా కన్వీనర్ గజరాజుల తిరుమలేష్, అధికార ప్రతినిధి నక్క మహేష్, వాణిజ్య విభాగం కన్వీనర్ కొండోజి గోపీనాథ్ తదితరులు సోనా మృతిపై సంతాపం వ్యక్తం చేశారు. బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి, వారికి ధైర్యం చెప్పారు. ఈ కష్టకాలంలో కుటుంబ సభ్యులు మనోధైర్యంతో ఉండాలని సూచించారు. ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన విద్యార్థిని మీనా త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. మృతురాలి ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడిని ప్రార్థించారు.





20.10.2026
మంగళవారం | హైదరాబాద్
ప్రజాక్షేత్రం
ప్రతి క్షణం.. ప్రజల పక్షం

# దుర్గామాత నవరాత్రుల సందర్భంగా ఆడబిడ్డలకు కానుకల పంపిణీ..

- **కుబీర్ మండల అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తా**
- **బీజేపీ యువ నాయకుడు కొండ సాయి ప్రసాద్ గౌడ్**

**నిర్మల్ జిల్లా అక్టోబర్ 19(ప్రజాక్షేత్రం):**

కుబీర్, దుర్గామాత నవరాత్రి పర్వదినాలను పురస్కరించుకొని బీజేపీ యువ నాయకుడు కొండ సాయి ప్రసాద్ గౌడ్ ఆడబిడ్డలకు కానుకలు పంపిణీ చేశారు. నిర్మల్ జిల్లా కుబీర్ మండలంలోని పార్డి (బి), హల్దా, చాతా, సిర్పెల్లి, పార్డి (కె) గ్రామాల్లో ఆడబిడ్డలకు గాజులు, రవికల గుడ్డలు, గోళ్ల రంగు, కుంకుమ భరిణెలు తదితర కానుకలను అందజేశారు. నవరాత్రి పర్వదినాల సందర్భంగా ఆడబిడ్డల ముఖాల్లో ఆనందం నింపాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కొండ సాయి ప్రసాద్ గౌడ్ మాట్లాడుతూ, దుర్గామాత నవరాత్రులు భక్తిశ్రద్ధలతో జరుపుకునే పవిత్రమైన పండుగలని పేర్కొన్నారు. ఈ పర్వదినాల సందర్భంగా ఆడబిడ్డలకు తన వంతుగా కానుకలు అందించడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. మహిళలు, ఆడబిడ్డలను గౌరవించడం మన సంస్కృతి, సంప్రదాయాల్లో భాగమని తెలిపారు. పండుగ వేళ ప్రతి ఇంట్లో ఆనందం వెల్లివిరియాలని, ఆడబిడ్డలు సంతోషంగా ఉండాలనే ఆకాంక్షతో ఈ కానుకలను పంపిణీ చేసినట్లు వెల్లడించారు. మహిళలు, ఆడబిడ్డల పట్ల గౌరవభావం కలిగి ఉండటంతో పాటు వారి సంతోషంలో భాగస్వాములు కావడం ప్రతి ఒక్కరి బాధ్యత అని ఆయన అన్నారు. మన సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుకుంటూ పండుగలను ఐకమత్యంతో జరుపుకోవాలని సూచించారు. ప్రజల మధ్య సోదరభావం, ఆప్యాయతలు పెంపొందించే ఇలాంటి కార్యక్రమాలు సమాజంలో మంచి వాతావరణాన్ని కల్పిస్తాయని పేర్కొన్నారు.

**కుబీర్ మండల అభివృద్ధే లక్ష్యం..**

కుబీర్ మండలంలోని అన్ని గ్రామాల అభివృద్ధికి తాను ఎల్లప్పుడూ ముందుంటానని బీజేపీ యువ నాయకుడు కొండ సాయి ప్రసాద్ గౌడ్ స్పష్టం చేశారు. మండలంలోని గ్రామాల ప్రజలకు అందుబాటులో ఉంటూ, వారి సమస్యలను తెలుసుకొని పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని తెలిపారు. గ్రామాల అభివృద్ధితో పాటు ప్రజల సంక్షేమానికి ప్రాధాన్యమిస్తూ సామాజిక సేవా కార్యక్రమాలను నిరంతరం కొనసాగిస్తానని పేర్కొన్నారు.

ప్రజలకు అవసరమైన సమయంలో అండగా నిలవడం, గ్రామాల్లో సానుకూల మార్పులకు తన వంతు సహకారం అందించడం తన బాధ్యతగా భావిస్తున్నానన్నారు. కుబీర్ మండలంలోని ప్రతి గ్రామం అభివృద్ధి పథంలో ముందుకు సాగాలన్నదే తన ఆకాంక్ష అని తెలిపారు. ప్రజల ఆదరాభిమానాలతో భవిష్యత్తులోనూ సేవా కార్యక్రమాలను మరింత విస్తృతంగా నిర్వహిస్తానని చెప్పారు. దుర్గామాత నవరాత్రుల సందర్భంగా ఐదు గ్రామాల్లో ఆడబిడ్డలకు కానుకలు పంపిణీ చేయడం ద్వారా పండుగ వేళ వారితో ఆనందాన్ని పంచుకున్నారు. మహిళలు, ఆడబిడ్డల పట్ల గౌరవాన్ని చాటుతూ, ప్రజాసేవే లక్ష్యంగా ముందుకు సాగుతానని కొండ సాయి ప్రసాద్ గౌడ్ తెలిపారు.





# బాధిత కుటుంబాలకు ఎమ్మెల్యే మేఘారెడ్డి పరామర్శ

- **అనారోగ్యంతో ఉన్నవారికి ధైర్యం.. మృతుల కుటుంబాలకు సానుభూతి**

**వనపర్తి, అక్టోబరు 19(ప్రజాక్షేత్రం):**

వనపర్తి పట్టణంతో పాటు రాజనగరం గ్రామంలో అనారోగ్యంతో బాధపడుతున్నవారిని, వివిధ కారణాలతో మృతి చెందినవారి కుటుంబాలను ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి సోమవారం పరామర్శించారు. బాధితుల ఆరోగ్య పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. మృతుల కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు.

**అనారోగ్యంతో ఉన్నవారికి పరామర్శ**

వనపర్తి పట్టణంలోని 18వ వార్డుకు చెందిన సాక్షి విలేకరి రాజు భార్య జి. సంధ్య గుండె సంబంధిత వ్యాధితో శస్త్రచికిత్స చేయించుకోవడంతో ఆమెను ఎమ్మెల్యే పరామర్శించారు. ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుని, ఆందోళన చెందవద్దని, అండగా ఉంటానని రాజుకు భరోసా ఇచ్చారు.

పట్టణంలోని 13వ వార్డుకు చెందిన రాజారెడ్డి గుండె శస్త్రచికిత్స అనంతరం ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటుండటంతో ఆయన నివాసానికి వెళ్లి ఆరోగ్య పరిస్థితిని తెలుసుకున్నారు. రాజనగరం గ్రామానికి చెందిన సీనియర్ కాంగ్రెస్ నాయకుడు గొడుగు వెంకటయ్య ముదిరాజ్ ఇటీవల శస్త్రచికిత్స చేయించుకుని కోలుకుంటుండటంతో ఆయనను పరామర్శించి, త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.

**మృతుల కుటుంబాలకు సానుభూతి**

వనపర్తి పట్టణంలోని ఐదో వార్డుకు చెందిన నరసింహ కుమారుడు రవి మృతి చెందడంతో జిల్లా ఆసుపత్రిలో ఉన్న కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే పరామర్శించి వివరాలు తెలుసుకున్నారు.

పట్టణంలోని 13వ వార్డుకు చెందిన కురుమయ్య కుమారుడు ఇటీవల విద్యుదాఘాతంతో మృతి చెందాడు. ఈ విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే స్థానిక కౌన్సిలర్ పరుశురాముతో వివరాలు తెలుసుకుని, బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు.

పట్టణంలోని 14వ వార్డుకు చెందిన బీటెక్ మొదటి సంవత్సరం విద్యార్థిని సోనా నాదర్‌గుల్‌లోని ఎంవీఎస్ఆర్ ఇంజినీరింగ్ కళాశాలలో నిర్వహించిన దాండియా కార్యక్రమం సందర్భంగా చోటుచేసుకున్న ప్రమాదంలో మృతి చెందింది. లైటింగ్ నిర్మాణం ప్రమాదవశాత్తు కూలిపోవడంతో ఆమె మృతి చెందగా, మృతదేహాన్ని వనపర్తిలోని నివాసానికి తీసుకువచ్చారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే అక్కడికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. సోనా మృతదేహానికి నివాళులర్పించారు.

**రాజనగరంలోనూ పరామర్శ**

రాజనగరం గ్రామానికి చెందిన గుండేటి సురేష్ మృతి చెందడంతో ఎమ్మెల్యే ఆయన నివాసానికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. మృతికి గల కారణాలను అడిగి తెలుసుకుని, కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. పలువురు నాయకుల హాజరు ఈ పరామర్శ కార్యక్రమంలో వనపర్తి మున్సిపల్ ఉపాధ్యక్షుడు మధుసూదన్ గౌడ్, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు కదిరె రాములు, మార్కెట్ యార్డు మాజీ అధ్యక్షుడు శ్రీనివాస్ గౌడ్, ఎస్ ఎల్ ఎన్ రమేష్, కౌన్సిలర్లు వెంకటేష్, శారద బ్రహ్మచారి, పాకనాటి కృష్ణయ్య, బి. కృష్ణయ్య, ఏర్పుల రవి, రాజు, రఘు యాదవ్, పరుశురాములు, పాల రవి, మైనార్టీ నాయకుడు బషీర్, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.





# బ్యాంకింగ్ సేవలపై ప్రత్యేక శిబిరాలు

- **అక్టోబర్ 21 నుంచి డిసెంబరు 31 వరకు నిర్వహణ**
- **సామాజిక భద్రతా పథకాలపై అవగాహన.. అర్హులు సద్వినియోగం చేసుకోవాలి**
- **జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి**

**వనపర్తి, అక్టోబరు 19(ప్రజాక్షేత్రం):**

జిల్లావ్యాప్తంగా ప్రజలకు బ్యాంకింగ్ సేవలు, కేంద్ర ప్రభుత్వ సామాజిక భద్రతా పథకాలను చేరువ చేసేందుకు ఈ నెల 21 నుంచి డిసెంబరు 31 వరకు ప్రత్యేక ప్రచార శిబిరాలు నిర్వహించనున్నట్లు సోమవారం జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరూ ఈ శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. జిల్లాలోని 15 మండలాల పరిధిలో ఉన్న 268 గ్రామ పంచాయతీలతోపాటు ఐదు మున్సిపాలిటీల పరిధిలో కేటాయించిన బ్యాంకుల ఆధ్వర్యంలో శిబిరాలు ఏర్పాటు చేయనున్నట్లు కలెక్టర్ వెల్లడించారు. ప్రతి గ్రామంలో ఒక శిబిరం నిర్వహించి, ప్రజలకు బ్యాంకింగ్ సేవలు, ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పించనున్నట్లు పేర్కొన్నారు.

బీమా, పింఛను పథకాలపై అవగాహన శిబిరాల్లో ప్రధానమంత్రి జీవన్‌జ్యోతి బీమా యోజన, ప్రధానమంత్రి సురక్షా బీమా యోజన, అటల్ పింఛను యోజన పథకాలపై వివరించడంతోపాటు అర్హులైన వారి నమోదు ప్రక్రియపై అవగాహన కల్పిస్తారు. వీటితోపాటు కిసాన్ క్రెడిట్ కార్డు (కేసీసీ) సేవలు, బ్యాంకు ఖాతాల పునరుద్ధరణ, క్లెయిమ్ చేయని బ్యాంకు డిపాజిట్లకు సంబంధించిన అంశాలపై సమాచారం అందించనున్నారు.

**డిజిటల్ మోసాలపై అప్రమత్తత**

డిజిటల్ బ్యాంకింగ్ సేవలను వినియోగించే సమయంలో మోసాల బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను ప్రజలకు వివరించనున్నారు. బ్యాంకింగ్ సేవల వినియోగం, సామాజిక భద్రతా పథకాల ప్రయోజనాలపై అవగాహన పెంపొందించేందుకు ఈ శిబిరాలు దోహదపడతాయని కలెక్టర్ తెలిపారు. ప్రజలు తమకు సమీపంలోని సంబంధిత బ్యాంకింగ్ శిబిరాల్లో పాల్గొని, అందుబాటులో ఉన్న సేవలు, పథకాల వివరాలు తెలుసుకోవాలని సూచించారు.



# విజయదశమి శుభాకాంక్షలు తెలిపిన ఎమ్మెల్యే మాణిక్ రావు

- **37 వార్డు కౌన్సిలర్ పెద్దబాయ్ మైపాల్**

**జహీరాబాద్ అక్టోబర్ 19(ప్రజాక్షేత్రం):**

విజయదశమి పర్వదినాన్ని పురస్కరించుకుని ఎమ్మెల్యే మాణిక్ రావు, వార్డు కౌన్సిలర్ పెద్దబాయ్ మైపాల్ ప్రజలకు విజయదశమి శుభాకాంక్షలు తెలిపారు. చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీకగా జరుపుకునే విజయదశమి ప్రతి ఒక్కరి జీవితాల్లో సుఖసంతోషాలు, శాంతి, అభివృద్ధిని తీసుకురావాలని ఆకాంక్షించారు. ప్రజలందరూ సుఖసంతోషాలతో పండుగను జరుపుకోవాలని కోరారు. పండుగ వేడుకలకు వార్డు 37 నుండి శివాలయ ప్రాంగణం లో ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరయ్యే అవకాశం ఉన్న నేపథ్యంలో కార్యక్రమం ప్రశాంతంగా, విజయవంతంగా నిర్వహించేందుకు తీసుకుంటున్న ఏర్పాట్లను ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించి, పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా రావణ దహన కార్యక్రమం నిర్వహించే ప్రాంతాన్ని పరిశీలించిన కౌన్సలర్ మహిపాల్ వేడుకలకు హాజరయ్యే ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమ ప్రాంగణంలో పరిశుభ్రత, ప్రజల రాకపోకులకు అనుకూలమైన వాతావరణం, భద్రతపరమైన చర్యలకు ప్రాధాన్యత ఇవ్వాలని పేర్కొన్నారు. పండుగ వేడుకలు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావు లేకుండా ప్రశాంత వాతావరణంలో జరిగేలా సంబంధిత అధికారులు, నిర్వాహకులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. దసరా పండుగ అనేది చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీకగా నిలిచే పవిత్రమైన పండుగ అని పేర్కొన్నారు. రావణ దహనం కార్యక్రమం సందర్భంగా ప్రజలు, ముఖ్యంగా పిల్లలు, వృద్ధులు సురక్షితంగా వేడుకలను వీక్షించేలా తగిన జాగ్రత్తలు పాటించాలని సూచించారు. పండుగను సంప్రదాయపద్ధంగా, సంతోషంగా నిర్వహించడంతో పాటు ప్రజల భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని తెలిపారు.

పండుగలు ప్రజల మధ్య ఐక్యతను, సోదర భావాన్ని పెంపొందిస్తాయని, కుల మతాలకు అతీతంగా అందరూ కలిసిమెలిసి వేడుకల్లో పాల్గొనడం మన సమాజంలోని సామరస్యానికి నిదర్శమని పేర్కొన్నారు. జహీరాబాద్ పట్టణంలో పండుగ వేడుకలు ప్రజలకు ఆనందాన్ని పంచేలా నిర్వహించుకోవాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా వార్డు కౌన్సలర్ పెద్ద బాయ్ మహిపాల్ ప్రతి కుటుంబంలో సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలు, శాంతి సౌభాగ్యాలు, సిరిసంపదలు వెల్లివిరియాలని ఆకాంక్షించారు. ప్రజల జీవితాల్లో విజయాలు, అభివృద్ధి, సంతోషం నిండాలని, జహీరాబాద్ పట్టణం అన్ని రంగాల్లో మరింత అభివృద్ధి చెందాలని కోరుకున్నారు. "దసరా పండుగ స్ఫూర్తితో ప్రతి ఒక్కరూ చెడును విడిచిపెట్టి మంచి మార్గంలో నడవాలని, సమాజ శ్రేయస్సు కోసం పరస్పర సహకారంతో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు." పట్టణ ప్రజలందరూ పండుగను కుటుంబ సభ్యులతో కలిసి ఆనందోత్సాహాలతో, సురక్షితంగా జరుపుకోవాలని కోరారు.




# నిరుద్యోగ యువతకు అండగా ఎమ్మెల్యే జీఎంఆర్

- **పోటీ పరీక్షల అభ్యర్థులకు ఉచిత స్టడీ మెటీరియల్, పుస్తకాల పంపిణీ**

**దేవరకద్ర అక్టోబర్ 19(ప్రజాక్షేత్రం):**

నిరుద్యోగ యువత ప్రభుత్వ ఉద్యోగాలు సాధించేందుకు అవసరమైన సహకారం అందిస్తూ దేవరకద్ర ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి (జీఎంఆర్) ముందుకు సాగుతున్నారు. ఆర్థిక ఇబ్బందులు యువత భవిష్యత్తుకు అడ్డంకిగా మారకూడదనే ఉద్దేశంతో జీఎంఆర్ సేవా సమితి ఆధ్వర్యంలో ఉచిత పోటీ పరీక్షల శిక్షణతో పాటు స్టడీ మెటీరియల్, పుస్తకాలను అందిస్తున్నారు. దేవరకద్ర ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నిర్వహిస్తున్న ఉచిత పోటీ పరీక్షల శిక్షణ శిబిరంలో కోచింగ్ పొందుతున్న యువతీ, యువకులకు ఎమ్మెల్యే జీఎంఆర్ ఉచితంగా స్టడీ మెటీరియల్, పుస్తకాలను పంపిణీ చేశారు. ఎస్సై, కానిస్టేబుల్ తదితర ప్రభుత్వ ఉద్యోగాల పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న అభ్యర్థులకు అవసరమైన మెటీరియల్‌ను అందజేసి వారి సన్నద్ధతకు మరింత ప్రోత్సాహం కల్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జీఎంఆర్ మాట్లాడుతూ.. యువత కష్టపడి చదివి, క్రమశిక్షణతో సాధన చేస్తూ ఉన్నత లక్ష్యాలను సాధించాలని పిలుపునిచ్చారు. జీవితంలో అనుకున్న లక్ష్యాన్ని చేరుకోవాలంటే పట్టుదల, నిరంతర కృషి, సమయపాలన ఎంతో ముఖ్యమని తెలిపారు. ఎన్ని అడ్డంకులు ఎదురైనా ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగి ప్రభుత్వ ఉద్యోగాలు సాధించి తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. యువత తమ విలువైన సమయాన్ని వృథా చేయకుండా చదువుపై పూర్తి దృష్టి సారించాలని, అందుబాటులో ఉన్న అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పోటీ పరీక్షల్లో విజయం సాధించి కుటుంబాలకు గర్వకారణంగా నిలవడంతో పాటు సమాజంలో మంచి గుర్తింపు పొందాలని కోరారు. ఆర్థిక ఇబ్బందుల కారణంగా ఏ ఒక్క విద్యార్థి కూడా చదువుకు దూరం కాకూడదనే లక్ష్యంతో 2016లో జీఎంఆర్ సేవా సమితిని ఏర్పాటు చేసి విద్యార్థులకు తనవంతు సహాయం అందిస్తున్నామని ఎమ్మెల్యే తెలిపారు. విద్యకు ప్రాధాన్యత ఇవ్వడం, పేద విద్యార్థులను ప్రోత్సహించడం, వారు ఉన్నత లక్ష్యాలను చేరుకునేందుకు తోడ్పడటం, అభాగ్యులకు అండగా నిలవడం సేవా సమితి ప్రధాన ఉద్దేశమని పేర్కొన్నారు. సివిల్స్ లక్ష్యం నుంచి న్యాయవాదిగా.. యువతకు తన అనుభవాన్ని పంచుకున్న జీఎంఆర్ విద్యార్థులతో ఎమ్మెల్యే జీఎంఆర్ తన విద్యార్థి జీవిత అనుభవాలను కూడా పంచుకున్నారు. విద్యార్థి దశ నుంచే క్రమశిక్షణతో, పట్టుదలతో ముందుకు సాగానని తెలిపారు. తాను సివిల్స్ సాధించాలనే లక్ష్యంతో హైదరాబాద్‌లో కోచింగ్ తీసుకుని కష్టపడి చదివి మొదటి ప్రయత్నంలోనే ప్రిలిమ్స్‌లో అర్హత సాధించానని చెప్పారు. అయితే మెయిన్స్‌కు సిద్ధమవుతున్న సమయంలో ఆరోగ్యం సహకరించకపోవడంతో పరీక్షలను సరిగా రాయలేకపోయానని తెలిపారు. అనంతరం జీవితంలో మరో లక్ష్యాన్ని నిర్దేశించుకుని న్యాయవిద్యపై దృష్టి సారించి పట్టుదలతో చదివి న్యాయవాదిగా మారానని, నిరంతర కృషితో లీడింగ్ అడ్వకేట్‌గా ఎదిగానని తన అనుభవాన్ని విద్యార్థులతో పంచుకున్నారు. జీవితంలో ఏదైనా సాధించాలంటే కష్టపడే తత్వం, పట్టుదల, నిరంతర ప్రయత్నం తప్పనిసరి అని ఎమ్మెల్యే పేర్కొన్నారు. విద్యార్థులు తమకు స్పష్టమైన లక్ష్యాలను నిర్దేశించుకుని వాటి సాధన కోసం క్రమశిక్షణతో కృషి చేయాలని సూచించారు. విద్యార్థుల కలలకు ఆర్థిక పరిస్థితులు అడ్డంకి కాకూడదనే లక్ష్యంతో ప్రతిభ ఉన్న ప్రతి ఒక్కరికీ ఎదిగే అవకాశం కల్పించేందుకు జీఎంఆర్ సేవా సమితి ద్వారా తనవంతు సేవ కొనసాగిస్తున్నానని తెలిపారు. విద్యార్థులకు సహాయం అందించడంతో పాటు దేవరకద్ర నియోజకవర్గంలో విద్యారంగ అభివృద్ధికి తనవంతు కృషిని నిరంతరం కొనసాగిస్తానని ఎమ్మెల్యే జీఎంఆర్ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ వైస్ చైర్మన్ మరియు కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు వివిధ గ్రామాల సర్పంచులు ప్రజా ప్రతినిధులు అధికారులు యువకులు మహిళలు తదితరులు పాల్గొన్నారు.

# పేదల సొంతింటి కలను నెరవేర్చడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యం.

- **దేవరకద్ర ఎమ్మెల్యే జిఎంఆర్**

**చిన్నచింతకుంట అక్టోబర్ 19(ప్రజా-క్షేత్రం):**

మండలంలోని నెల్లికొండి గ్రామానికి చెందిన ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు దేవరకద్ర ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి (జీఎంఆర్) ప్రొసీడింగ్స్‌ను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా అర్హులైన పేద కుటుంబాలకు సొంతింటి కలను నెరవేర్చడమే కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. అర్హులైన ప్రతి కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా కృషి చేస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు వెంకటేష్ యాదవ్ మరియు కాంగ్రెస్ పార్టీ నాయకులు యువకులు మహిళలు తదితరులు పాల్గొన్నారు.




# జనగాంలో అంబరాన్నంటిన బతుకమ్మ సంబరాలు

**పెద్దేముల్, అక్టోబర్ 19 (ప్రజాక్షేత్రం):**

వికారాబాద్ జిల్లా పెద్దేముల్ మండల పరిధిలోని జనగాం గ్రామంలో సోమవారం బతుకమ్మ సంబరాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు, యువతులు రంగురంగుల పూలతో బతుకమ్మలను అందంగా పేర్చి, సంప్రదాయ దుస్తుల్లో ఆటపాటలతో సందడి చేశారు. తెలంగాణ సంస్కృతి, సాంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ వేడుకలను ఉత్సాహంగా జరుపుకున్నారు. గ్రామంలో పండుగ వాతావరణం నెలకొంది. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, మహిళలు, యువతులు, చిన్నారులు, గ్రామస్తులు పాల్గొన్నారు.







## దీపావళికి 'స్పిరిట్' ధమాకా

కథానాయకుడు ప్రభాస్.. దర్శకుడు సందీప్ రెడ్డి వంగా కలయికలో రూపొందుతున్న పాన్ ఇండియా చిత్రం 'స్పిరిట్'. గుల్షన్ కుమార్ సమర్పణలో టీ సిరీస్, భద్రకాళి పిక్చర్స్ సంస్థలు నిర్మిస్తున్నాయి. త్రిప్తి దిమ్రీ కథానాయిక. వచ్చే ఏడాది మార్చి 5న విడుదల కావాల్సిన ఈ సినిమా వాయిదా పడింది. దీన్ని దీపావళి సందర్భంగా 2027 అక్టోబరు 29న ప్రేక్షకుల ముందుకు తీసుకురానున్నట్లు చిత్రబృందం ఆదివారం అధికారిక ప్రకటన విడుదల చేసింది. ఈమేరకు ఓ కొత్త పోస్టర్‌ని నెట్టింట పంచుకుంది. ప్రభాస్ అందులో స్టైలిష్ లుక్‌లో ఆకట్టుకునేలా కనిపించారు. భారీ యాక్షన్ థ్రిల్లర్‌గా ముస్తాబవుతున్న ఈ సినిమాలో ఆయన శక్తిమంతమైన పోలీసు పాత్రలో అలరించనున్నారు. వివేక్ ఒబెరాయ్, కాంచన, ప్రకాశ్‌రాజ్ తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. దీనికి హర్షవర్ధన్ రామేశ్వర్ సంగీతమందిస్తుండగా.. రాజ్ తోట ఛాయాగ్రాహకుడిగా వ్యవహరిస్తున్నారు.

## 'ధర్మన్'లో నయన్?



'చంద్రముఖి', 'దర్బార్' లాంటి చిత్రాల్లో కలిసి నటించి హిట్ జోడీ అనిపించుకున్నారు అగ్రహీరో రజనీకాంత్, కథానాయిక నయనతార. ఇప్పుడు వీరిద్దరూ మరోసారి తెరపై సందడి చేయడానికి సన్నద్ధమవుతున్నట్లు తెలుస్తోంది. రజనీకాంత్ ప్రధాన పాత్రలో నటిస్తున్న చిత్రం 'ధర్మన్'. అశ్వత్ మారిముత్తు దర్శకత్వం వహిస్తున్నారు. తాజాగా ఈ చిత్రంలో ఓ కీలక పాత్రలో కనువిందు చేయనున్నారట నయన్. ఆమె పాత్ర సినిమాకి ప్రధాన ఆకర్షణగా నిలవనుందని, త్వరలో దీనిపై అధికారిక ప్రకటన వెలువడే అవకాశాలున్నాయని సమాచారం. కమల్ హాసన్ తన రాజ్‌కమల్ ఫిల్మ్స్ ఇంటర్నేషనల్ సంస్థపై ఆర్. మహేంద్రన్‌తో కలిసి దీన్ని నిర్మిస్తున్నారు. ప్రస్తుతం శరవేగంగా చిత్రీకరణ చేసుకుంటోన్న ఈ చిత్రంలో స్టైలిష్ డాక్టర్‌గా కనిపించనున్నారు రజనీ. ఇందులో సిమ్రాన్, రాశీఖన్నా తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు.

## తెరపై సంబరమే తరువాయి..



సంక్రాంతి బరిలో 'సంబరాల ఏటి గట్టు' చిత్రంతో సందడి చేయనున్నారు కథానాయకుడు సాయి దుర్గా తేజ్. రోహిత్ కేపీ దర్శకత్వం వహించిన ఈ సినిమాని కె.నిరంజన్ రెడ్డి, చైతన్య రెడ్డి సంయుక్తంగా నిర్మిస్తున్నారు. ఐశ్వర్య లక్ష్మి కథానాయిక. ధనంజయ, జగపతిబాబు, నరేశ్ తదితరులు కీలక పాత్రలు పోషించారు. 160రోజులకు పైగా చిత్రీకరణ చేసుకున్న ఈ సినిమా మొత్తం షూట్‌ని పూర్తి చేసుకున్నట్లు ఆదివారం ప్రకటించారు. ఈ మేరకు ఓ ప్రత్యేక వీడియోను నెట్టింట పంచుకున్నారు. ఇదొక భారీ పీరియాడిక్ యాక్షన్ డ్రామా సినిమా. సాయితేజ్ ఇందులో మునుపెన్నడూ చూడని రీతిలో రా రస్టిక్ లుక్‌లో ఓ యోధుడిలా కనిపించనున్నారు. ప్రస్తుతం ఈ చిత్ర నిర్మాణానంతర పనులు శరవేగంగా జరుగుతున్నాయి. ఇది సంక్రాంతి సందర్భంగా జనవరి 12న థియేటర్లలోకి రానుంది.



## నాకు నేనే నిలబడాలని చేసిన చిత్రమిది

"ఈ భయం, స్ట్రెస్, యాంగ్జైటీ, డిప్రెషన్ తీసుకోవద్దు ఇయ్యాలి.. ఇచ్చి పడేయ్యాలి" అంటున్నారు విష్వక్ సేన్. ఇప్పుడాయన కథానాయకుడిగా నటిస్తూ.. స్వీయ దర్శకత్వంలో రూపొందించిన చిత్రం '#కల్ట్'. సందీప్ కాకరాల నిర్మాత. గాయత్రి భరద్వాజ్, తారక్ పొన్నప్ప, మురళీ శర్మ తదితరులు కీలక పాత్రలు పోషించారు. ఈ సినిమా ఈనెల 30న థియేటర్లలోకి రానుంది. ఈ నేపథ్యంలోనే ఆదివారం హైదరాబాద్‌లో ట్రైలర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా హీరో, దర్శకుడు విష్వక్ సేన్ మాట్లాడుతూ.. "వరుసగా మూడు ఫ్లాప్‌లు ఎదురైనప్పుడు కాస్త ఒత్తిడి, ఆందోళన చుట్టుముట్టాయి. నేనేమైనా తప్పు దారిలో వెళ్తున్నానా అనే సందేహం కలిగింది. అప్పుడే నా ఆయుధం నా చేతిలోనే ఉందని మా అన్న నాకు గుర్తు చేశారు. 'ఫలక్‌నుమా దాస్' సినిమా సమయంలో నా కోసం నేనెలాగైతే నిలబడ్డానో.. ఇప్పుడూ అలాగే నేనే నిలబడాలని గ్రహించి ఈ చిత్రాన్ని మొదలు పెట్టా. నిజానికి దీనికి తొలుత తాజుద్దీన్‌ని దర్శకుడిగా అనుకున్నాం. నా నట జీవితానికి ఆయనే గురువు. కానీ, వరుస పరాజయాల్లో ఉన్నప్పుడు నా చిత్ర బాధ్యతని నేనే తీసుకోవాలని దర్శకత్వ బాధ్యతని భుజాన వేసుకున్నా. ఈ విషయంలో తాజుద్దీన్‌కు క్షమాపణలు చెప్తున్నా. ఈ సినిమాతో దాదాపు 150మంది కొత్త నటీనటులు తెరకు పరిచయం కానున్నారు. వాళ్లు, నిర్మాతలు ఇచ్చిన సహకారంతోనే ఈ సినిమాని చేయగలిగా. సినిమా ప్రారంభమైన అయిదు నిమిషాల్లోనే ప్రేక్షకులు ఒక కొత్త ప్రపంచంలోకి వెళ్తారు" అన్నారు. ఈ కార్యక్రమంలో అనిరుధ్ భాస్కర్, కార్తికేయ, ఇజి, తారక్, సందీప్ కాకర్ల తదితరులు పాల్గొన్నారు.



## అందుకే నాయికా ప్రాధాన్య కథలో!

"సైయారా' తర్వాత రొమాంటిక్ చిత్రాలకు దూరంగా ఉండి.. సోలో సినిమా చేయాలనుకున్నాన"ని అంటున్నారు బాలీవుడ్ యువ కథానాయిక అనీత్ పడ్డా. చిత్రపరిశ్రమలోకి వచ్చిన తొలి అడుగులోనే మంచి క్రేజ్ సంపాదించుకున్న ఈ తార.. త్వరలో 'శక్తి శాలిని' అనే మహిళా ప్రాధాన్య చిత్రంతో అలరించడానికి సన్నద్ధమవుతున్నారు. ఈ నేపథ్యంలోనే ఇటీవలే ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న అనీత్ మాట్లాడుతూ.. "హారర్ నేపథ్యంలో రూపొందుతున్న 'శక్తి శాలిని'లో నటించే అవకాశం రావడం అదృష్టంగా భావిస్తున్నా. 'సైయారా' తర్వాత నేను ఇలాంటి చిత్రంలోనే నటించాలని ఆశపడ్డా. అతీంద్రియ శక్తులతో రూపొందుతున్న ఈ చిత్రం నాలోని కొత్త కోణాన్ని తెరపై ఆవిష్కరించనుంది. నిజం చెప్పాలంటే నేను ఒక నాయికా ప్రాధాన్య కథలో నటించాలనుకున్నా. ఎందుకంటే ఇది నా సినిమా అని గర్వంగా చెప్పకోగలిగే అవకాశం నాకు రావాలని కోరుకున్నా. కానీ రెండో సినిమాతోనే ఇలాంటి ఆఫర్ లభించడం ఆనందంగా ఉంది. ఈ సినిమా మొత్తం బాధ్యత నాపైనే ఉండటం కొంచెం భయంగా అనిపించినప్పటికీ.. చిత్ర ఫలితం ఏదైనా సరే... దానికి నేను బాధ్యత వహిస్తా" అని చెప్పకొచ్చారు.



## కొత్త కబురు వినిపిస్తారా!

కథానాయకుడు వరుణ్ తేజ్ ఇటీవలే 'కొరియన్ కనకరాజు'తో ప్రేక్షకుల్ని పలకరించారు. ప్రస్తుతం తన కాలి గాయం నుంచి కోలుకుంటున్న ఆయన త్వరలోనే 'బరి' సినిమా కోసం రంగంలోకి దిగనున్నారు. అయితే ఈలోగానే ఇప్పుడీ విరామంలో కొన్ని కథలు విన్నట్లు తెలిసింది. ఈక్రమంలోనే ఓ సినిమాకి సూత్రప్రాయంగా అంగీకారం తెలిపినట్లు తెలుస్తోంది. దర్శకుడు అట్లీ శిష్యుడైన బాలాజీ దీనికి దర్శకత్వం వహించనున్నారని.. తమిళ దర్శకుడు కార్తిక్ సుబ్బరాజు ఈ ప్రాజెక్ట్‌ని నిర్మించే అవకాశముందని సమాచారం. అంతేకాదు మరోవైపు 'ఆయ్' ఫేమ్ అంజి కూడా వరుణ్‌కి ఓ స్క్రిప్ట్ వినిపించినట్లు ప్రచారం వినిపిస్తోంది. ప్రస్తుతం తన చేతిలో ఉన్న చిత్రాన్ని పూర్తి చేశాకే వరుణ్ ఈ రెండు ప్రాజెక్ట్‌లపై దృష్టి సారించనున్నారు.

## సూర్య 'సీన్' నుంచి రెండో పాట అప్డేట్..

కోలీవుడ్ స్టార్ హీరో సూర్య ప్రధాన పాత్రలో నటిస్తున్న లేటెస్ట్ యాక్షన్ డ్రామా 'సీన్'. 'ఆవేశం' ఫేమ్ జీతూ మాధవన్ దర్శకత్వంలో రాబోతున్న హై వోల్టేజ్ యాక్షన్ మూవీ సూర్య కెరీర్‌లో 47వ సినిమాగా రాబోతుంది. 2D ఎంటర్‌టైన్‌మెంట్స్, జగరం స్టూడియోస్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నాయి. ప్రముఖ మలయాళ మ్యూజిక్ డైరెక్టర్ సుశిన్ శ్యామ్ సంగీతాన్ని అందిస్తున్నారు. ఇప్పటికే ఈ సినిమాకు సంబంధించిన టైటిల్ గ్లింప్స్ రిలీజ్ కాగా.. ఇందులో సూర్య డీఎస్పీ ప్రేమ్ రాజ్‌గా కనిపించిన తీరు ఫ్యాన్స్‌లో కొత్త ఉత్సాహాన్ని నెలకొల్పింది. అలాగే ఫస్ట్ సింగిల్‌కు సోషల్ మీడియాలో మంచి రెస్పాన్స్ వచ్చింది. ఇందులో భాగంగానే తాజాగా సెకండ్ సింగిల్ అప్డేట్ ఇచ్చారు మేకర్స్. 'సీన్ నుండి రెండవ సింగిల్ 'Airplane' రేపు సాయంత్రం 6 గంటలకు విడుదలవుతోంది' అంటూ ఓ సరికొత్త పోస్టర్‌ను రిలీజ్ చెయ్యగా.. ఫ్యాన్స్ ఫుల్ ఖుష్ అవుతున్నారు. కాగా.. ఈ మూవీలో సూర్యకు జోడీగా నజ్రియా నజీమ్ హీరోయిన్‌గా నటిస్తుండగా, 'ప్రేమలు' ఫేమ్ మలయాళ నటుడు నస్లెన్ కీలక పాత్రలో పోషిస్తున్నాడు. సుశిన్ శ్యామ్ మ్యూజిక్ అందిస్తున్నాడు. దీపావళి కానుకగా నవంబర్ 6, 2026న థియేటర్లలో విడుదల కాబోతున్నది.




Printed, Published and Owner by K PRAVEEN KUMAR, Printed at MR Publications, A-20, Vambay Colony, Upparpally, Ranga Reddy (Dist), Hyderabad, Telangana 500048. Published at H.NO. 2-50 Shankar pally, Ranga Reddy. Hyderabad, Telangana 501203. Editor: KPRAVEEN KUMAR. Phone number 9177920459, email id: prajakshetram1@gmail.com, https://prajakshetram.com PRGI NO. TGTEL/25/A2394